సహజీవన భావనల పావురాయి

# పావురాయి

వారపత్రిక 27-12-2024 ₹ 15/-



# ఇది ఫ్యాషన్ కాదు






సహజీవన భావాల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 51 హైదరాబాద్
శుక్రవారం 27 డిసెంబర్ 2024 రూ.15-00
25 జమాది ఉల్ ఆఖిర్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

## నిగ్రహం, సౌశీల్యత, సంతులిత వైఖరి దైవదౌత్యంలో ఒక భాగం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




12

మత సామరస్యం కోసం
కడదాకా కృషి చేసిన గాంధీజీ

## లోపల...


| | | |
|---|---|---|
| అడుగడుగున గుడి ఉంది | ...... | 04 |
| ఇది ఫ్యాషన్ కాదు | ...... | 05 |
| అమ్మ పెట్టా పెట్టదు... అడుక్కు తినా తిననివ్వదు | ...... | 08 |
| మంచిని పెంచాలి | ...... | 11 |
| పోలీసు బలగాలలో నామమాత్రంగానే ముస్లింల ప్రాతినిధ్యం | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఆచరణకు ప్రాణం విశ్వాసం - 2 | ...... | 20 |
| కాలంతో పోటీ పడదాం! | ...... | 22 |
| ఆత్మ పరిశీలనా సందర్భం | ...... | 24 |
| అక్కడ అబ్బాయి పుడితే 'ముహమ్మద్' పేరు పెట్టాల్సిందే! | ...... | 25 |
| ఫజర్ నమాజుకు లేస్తున్నారా? | ...... | 26 |
| చరితార్థులు-2 : మౌలానా అలీ హుస్సేన్ | ...... | 27 |
| ఖుర్ఆన్‌లో మర్యమ్ జీవిత గాథ | ...... | 28 |
| పక్షులు, కీటకాల పోషణా అల్లాహ్‌దే! | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| అతిథి సత్కారం స్వర్గానికి మార్గం | ...... | 34 |


### పుస్తకాల పండుగ ...




అంగరంగ వైభవంగ
మొదలైంది పండుగ
పుస్తకాల పురుగులే
గ్రౌండ్ అంత నిండుగ!

మొదలైంది మొన్ననే
పెంచుకోండి విజ్ఞానం
భలేమంచి పుస్తకాలు
తొలగిస్తయి అజ్ఞానం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# అడుగడుగున గుడి ఉంది

**సంభల్ షాహీ** మస్జిదు వివాదం, కాల్పులు, అమాయకుల మరణాల వార్తలు మనం విన్నాం. షాహీ మస్జిదు క్రింద మందిరముందో లేదో తెలియదు కాని సంభల్‌లో ఒక పాత గుడి బయటపడింది. ఈ గుడి షాహీ మస్జిదు క్రింద దొరకలేదు. మరే ఇతర మస్జిదు క్రింద కూడా దొరకలేదు. వేరే చోట దొరికింది.

కాని, సంభల్‌లోని ఒక ముస్లిం లొకాలిటీలో గత కొన్ని సంవత్సరాలుగా మూతపడి ఉన్న ఒక గుడిని కనిపెట్టారు. అక్కడి అధికారులు, పోలీసులు దాన్ని పునరుద్ధరించారు. గుడి వద్ద ఉన్న బావిని కూడా బాగు చేయించారు. పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ గుడి ఎంత ప్రాచీనమైనదో కనిపెట్టాలని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు కూడా రాశారు. జిల్లా కలెక్టరు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌లు అక్కడ పూజలు చేసి తమ భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. గుడి వద్ద భద్రతా చర్యల కోసం సిసిటీవీ కెమెరాలు కూడా ఇప్పుడు పెట్టారు.

సంభల్ షాహీ మస్జిదు సర్వే విషయంలో అత్యుత్సాహం చూపించి నలుగురు అమాయక ముస్లిం యువకుల మృతికి కారణమైన పాలనా యంత్రాంగంలో ఈ గుడి దొరికిన తర్వాత కొత్త ఉత్సాహం వచ్చింది. సంభల్‌లోని ఈ ఖగ్గు సరాయి లొకాలిటీలో హిందువులు తరలిపోతున్నారని, వారికి భద్రత లేదని, అందువల్లనే ఈ గుడి ఇలా పాడుపడిపోయిందని ప్రచారం మొదలుపెట్టారు.

కాని ఈ ప్రచారాన్ని అక్కడి స్థానిక హిందువులే తిప్పికొట్టారు. స్థానికంగా ఉన్న కొందరు హిందువులు ఇతర ప్రాంతాలకు తరలిపోవడం నిజమే అయినా దానికి అనేక కారణాలున్నాయి. పైగా ఈ గుడిలో 2006 వరకు పూజలు జరిగేవి. ఈ విషయాన్ని ధర్మేంద్ర రస్తోగి చెప్పారు. ఎందుకంటే ఈ గుడికి తాళమేసి వెళ్ళింది ఆ కుటుంబమే. అంతేకాదు, గుడి చుట్టు ప్రహరీ గోడ వంటిది కట్టించి, గుడికి భద్రత కల్పించి కూడా వెళ్ళారు. వాళ్ళు సంభల్‌లోని తమ ఆస్తిని అమ్మేసి వేరే ప్రాంతానికి వెళ్ళిపోయారు. ఎవరికీ భయపడి తాము వెళ్ళలేదని, తమ స్వంత కారణాల వల్ల వెళ్ళామని కూడా ఆయన స్పష్టంగా చెప్పాడు.

ఈ ప్రాంతంలో 1978లో మతఘర్షణలు జరిగాయి. అప్పట్లో కొందరు ఈ ప్రాంతం వదిలి వెళ్ళిపోయారు. అయితే ఆ తర్వాత తాము తరచు రావడం, గుళ్ళో పూజలు చేయడం జరుగుతూనే ఉందని విష్ణు శరణ్ రస్తోగీ అన్నాడు. ఇక్కడ పూజారి లేరు. పూజలు చేయడానికి కూడా ఎవ్వరు రావడం లేదు కాబట్టి గుడికి తాళం వేశామని కూడా వివరించాడు.

గుడికి పక్కనే ఒక గది కూడా కట్టి ఉంది. ఆ గది కట్టి గుడిని ఆక్రమించుకునే ప్రయత్నాలు జరిగాయనే ప్రచారం ఒకటి తీసుకొచ్చారు. కాని ఆ ప్రచారాన్ని కూడా రస్తోగి కుటుంబం ఖండించింది. ఆ గదిని కట్టించింది తామేనని స్పష్టంచేసింది. గుడి తాళాలు కూడా ఆ కుటుంబం వద్దనే ఉన్నాయి.

కాని యోగీ ఆదిత్యనాథ్ మాత్రం మతవిద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానలేదు. ఇలాంటి ప్రాచీన గుడి ఎలా పాడుపడింది? 1978 నుంచి ఈ గుడి మూతపడి ఉందంటూ మతఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు.

దేశంలో గుళ్ళు గోపురాల పైనే రాజకీయాలు నడుస్తున్నప్పుడు మతసామరస్యానికి కారణమైన ఆరాధనాలయాలు కూడా ఇప్పుడు మతం చిచ్చు పెట్టడానికి సాధనాలుగా మారుతున్నాయన్నది వాస్తవం. ఈ పరిస్థితిని మార్చే బాధ్యత ప్రజల పైనే ఉంది. ఓటు బలంతోనే ఈ పరిస్థితిని మార్చాలి.

★★★

అబ్దుల్ వాహెద్



# ఇది ఫ్యాషన్ కాదు

**అమిత్ షా** పార్లమెంటులో చెప్పిన మాటలపై ఇప్పుడు దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నేతలు అంబేద్కర్ పేరు పదే పదే చెప్పడం ఒక ఫ్యాషన్ అయిపోయిందని, ఇన్ని సార్లు అంబేద్కర్ పేరు పలికే బదులు దైవనామస్మరణ చేస్తే ఏడు జన్మలకు ముక్తి లభించేదన్నారాయన. ఇది నిస్సందేహంగా అంబేద్కర్‌ను అవమానించడమే.

అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు పూనుకుంది. ఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడు రాజేష్ లిలోటియా నాయకత్వంలో అమిత్ షా ఇంటి ముందు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రదర్శన చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రెస్ కాన్ఫరెన్స్ చేసి అమిత్ షా క్షమాపణ కోరాలని, ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

మరోవైపు బీజేపీ అమిత్ షా చెప్పిన మాటల్లో తప్పేమీ లేదని ఆయన్ను సమర్థించే ప్రయత్నాలు ప్రారంభించింది. తర్వాత అమిత్ షా కూడా స్వయంగా ప్రెస్ కాన్ఫరెన్స్ చేసి తన మాటలను వక్రీకరిస్తున్నారంటూ చెప్పుకున్నారు. రాజ్యసభలో ఈ మాటలు అమిత్ షా చెప్పారు. ఇంతవరకు ఈ మాటలను రికార్డుల నుంచి తొలగించలేదు. అమిత్ షా మొత్తం వ్యాఖ్యలో చెప్పిన మాటల్లో కాంగ్రెస్ అంబేద్కర్ పట్ల వ్యతిరేకవైఖరి చూపించిందన్న వివరణ లున్నాయి కాబట్టి ఇదంతా అందులో భాగంగా చూడాలన్న వాదన నిలబడే వాదన కాదు. ఎందుకంటే, అంబేద్కర్ గురించి మాట్లాడ్డం ఒక ఫ్యాషన్ అయిపోయిందని చెప్పడం, అంబేద్కర్ పేరుకు బదులు దైవనామస్మరణ చేసుకుంటే ముక్తి లభించేదని చెప్పడం అంబేద్కర్‌ను కించపరచడంగానే చూడాల్సి ఉంటుంది. అంతకన్నా ముందు అమిత్ షా ఏం చెప్పారు, ఆ తర్వాత ఏం చెప్పారన్నది ఇందులో అంత ప్రాముఖ్యం ఉన్న విషయంగా ముందుకు రావడం లేదు.

ఏది ఏమైనా బీజేపీ చాణక్య అమిత్ షా ప్రతిపక్షాల చేతికి ఆయుధమిచ్చారు. తన ప్రసంగంలో చిన్న భాగాన్ని తీసుకుని వ్యతిరేక ప్రచారం చేయడం అనుచితమని అమిత్ షా తన ప్రెస్ కాన్ఫరెన్సులో చెప్పారు. కాని ఇప్పటి వరకు బీజేపీ నేతలు చేస్తూ వచ్చింది ఇదే కదా. రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీల ప్రసంగాల్లో చిన్న చిన్న ముక్కలు తీసుకుని, వక్రీకరించి ప్రచారం చేయడం ప్రారంభించింది బీజేపీయే. మరోవైపు ఫేక్ వార్తలను కూడా ప్రచారం

చేయడం ద్వారా రాజకీయ లాభాలకు ప్రయత్నించే వ్యూహాలు అమలు చేస్తూ వచ్చారు. ఏది ఏమైనా అమిత్ షా ప్రతిపక్షాలకు ఒక అవకాశం ఇచ్చారు.

పార్లమెంటు పరిసరాల్లో ప్రతిపక్షాలు అంబేద్కర్ చిత్రాలను పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. సంజయ్ సింగ్, మనోజ్ ఝా, రాంగోపాల్ యాదవ్, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అమిత్ షా దళితవిరోధి అని మమతాబెనర్జీ మండిపడ్డారు. మనుస్మృతిని పాటించేవారికి అంబేద్కర్ అంటే పడదని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మల్లికార్జున్ ఖర్గే ట్వీట్ చేస్తూ అమిత్ షా వ్యాఖ్యల వల్ల బీజేపీ, ఆరెస్సెస్ జాతీయ జెండాకు వ్యతిరేకులన్నది స్పష్టమవుతుందన్నారు. గతంలో వీళ్ళు అశోక్ చక్రను వ్యతిరేకించారని, ఆరెస్సెస్ ప్రారంభం నుంచి భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతి కావాలంటున్నారని, అంబేద్కర్ అలా జరక్కుండా చూశారని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అమిత్ షా వ్యాఖ్యల వల్ల రాహుల్ గాంధీ చేపట్టిన సంవిధాన్ బచావ్ నినాదానికి మరింత బలం వచ్చింది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేసింది. కేజ్రీవాల్, చంద్రశేఖర్ ఆజాద్ తదితరుల ట్వీట్లు కూడా వచ్చాయి.

అమిత్ షా మొత్తం ప్రసంగంలో చెప్పిందేమిటంటే, ప్రతిపక్షాలు అంబేద్కర్ పట్ల చూపిస్తున్న శ్రద్ధాభక్తుల్లో నిజాయితీ లేదు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ నేతలే వ్యతిరేకించారని ఆయన చెప్పాలనుకున్నారు.

ప్రతిపక్షాల విమర్శల తర్వాత స్వయంగా ప్రధాని మోడీ రంగంలోకి దిగి హోంమంత్రికి మద్దతుగా నిలబడ్డారు. ఆరు ట్వీట్లు చేశారు. కాంగ్రెస్ అంబేద్కర్‌ను అవమానించిందన్నారు. కాని ఈ మాటలెలా ఉన్నా అంబేద్కర్ పేరు పలకడం ఫ్యాషన్ అయిపోయిందన్న వాఖ్య చేయవలసిన అవసరం అమిత్ షాకు ఎందుకు వచ్చింది? ఇది అంబేద్కర్‌ను అవమానించడం కాదా? అంబేద్కర్, నెహ్రూ సమకాలీనులు. వారిద్దరి మధ్య ఏం జరిగింది అనే చర్చ వేరే విషయం. దానిపై విమర్శ ప్రతివిమర్శలు జరగవచ్చు. కాని అంబేద్కర్ పేరు పలకడం ఫ్యాషన్ అయిపోయిందనడంలో అర్థమేమిటి? కేజ్రీవాల్ ఈ వ్యవహారంలో నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడులను కూడా లాగుతూ, మీ వైఖరి ఏమిటని నిలదీశాడు. మల్లికార్జున్ ఖర్గే తన ప్రెస్ కాన్ఫరెన్సులో ఈ మాటలను నిలదీస్తూ, బీజేపీ వాళ్ళు రాజ్యాంగాన్ని ఒప్పుకోవడం లేదని, అందుకే స్వర్గనరకాలంటూ మనుస్మృతి గురించే మాట్లాడుతున్నారని అన్నారు.

కాంగ్రెస్, ప్రతిపక్షాలు అంబేద్కర్ పేరు పలకడంలో నిజాయితీ లేదని అమిత్ షా చెప్పాలనుకున్నారు. కాని ఫ్యాషన్ అని చెప్పి, ముక్తి గురించి మాట్లాడి మొత్తం వ్యవహారాన్ని తల్లకిందులు చేసుకున్నారు. ఇదేమి చాణక్యమో బీజేపీయే చెప్పాలి.

ఇన్నిసార్లు దేవుని పేరు పలికితే స్వర్గం లభిస్తుందని అమిత్ షా చెప్పారు. కేవలం దైవనామస్మరణ చేస్తే స్వర్గం లభించేస్తుందా? సదాచరణల పరిస్థితేమిటి? ఇవి ధార్మిక తాత్విక ప్రశ్నలు. వాటిని పక్కన పెడితే, కేవలం నామస్మరణ చేస్తే స్వర్గం లభిస్తుందనడం ఎలా ఉందంటే అధికరణ 370 రద్దు చేస్తే చాలు కశ్మీరులో సమస్యలు అన్ని సమాప్తమైపోతాయని, ఎవరైనా వెళ్ళి కశ్మీరులో ప్లాటు కొనుక్కోవచ్చన్నట్లుంది. ఎంతమంది ఇప్పుడు కశ్మీరులో ప్లాట్లు కొన్నారో ప్రభుత్వమే లెక్కలు చెప్పాలి.

ఏది ఏమైనా డా. అంబేద్కర్ పేరు పలకడం ఫ్యాషన్ కాదు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల వద్దకు చేర్చాలంటే ఆయన పేరు వేలాది సార్లు పలకడం తప్పదు. ఇది ఫ్యాషన్ కాదు. నేడు కూడా ఎంతో అవసరమైన విషయం. ఎందుకంటే, కొన్ని రోజుల క్రితమే ఒక దళిత వరుడు, పైగా పోలీసులో పనిచేస్తున్న యువకుడు, తన పెళ్ళికి గుర్రంపై వస్తుంటే రాళ్ళ వాన కురిపించారు. ఊరేగింపుపై దాడి చేసి హంగామా చేశారు. ఇది బులంద్ షహర్‌లో డిసెంబర్ 16న జరిగిన సంఘటన. ఏదో పాత సంఘటన కాదు. ఇలాంటి వార్తలు రోజు వస్తూనే ఉన్నాయి. డిసెంబర్ 11న మధ్యప్రదేశ్‌లోని దామోలో ఒక దళిత వరుడు గుర్రపు బగ్గీలో వస్తుంటే అతనిపై దాడి జరిగింది. హాత్రస్ గురించి రాహుల్ గాంధీ ప్రస్తావిస్తే తప్పేముంది? హత్రస్ బాధితులకు సహాయ సహకారాలందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు చేయలేదని అడిగితే తప్పేముంది? ఈ ప్రశ్నల నేపథ్యంలో అంబేద్కర్ పేరు వస్తే అందులో తప్పేముంది? ఈ ప్రశ్నలకు జవాబు అంబేద్కర్ పేరుతో ఎవరెన్ని విగ్రహాలు కట్టారన్నది జవాబు కాదు. ఈ విషయంలో అంబేద్కర్ పేరు ప్రస్తావనకు వస్తే అది ఫ్యాషన్ కాదు. లక్షల రూపాయల కోటు తొడగడంలో ఫ్యాషన్ ఉంది.

నెహ్రూ వర్సెస్ పటేల్, నెహ్రూ వర్సెస్ అంబేద్కర్ అంటూ నడిపే ఈ రాజకీయాలు కొంతకాలం బీజేపీకి ఎన్నికల ప్రయోజనాలు సాధించిపెట్టాయి. కాని ఇప్పుడు ఈ రాజకీయాలు తిరగబడుతున్నాయి. పటేల్‌ను ప్రధాని చేయలేదని బీజేపీ చెప్పిన మాటల్లో వాస్తవాలు కూడా ముందుకు వచ్చేశాయి. పటేల్ 1950లో మరణించారు. అప్పటి కాంగ్రెస్ కమిటీ చర్చల్లో ఎవరిని ప్రధాని చేయాలన్న చర్చ జరగనే లేదు. పటేల్ ప్రధాని కాలేదని కాంగ్రెస్ కమిటీలో ఎవ్వరు నిరసన తెలియజేయలేదు. ఇదేవిధంగా బీజేపీ నేతలు నెహ్రూ వర్సెస్ అంబేద్కర్ చేస్తుంటారు. అంబేద్కర్ తన మంత్రిపదవికి రాజీనామా చేశారన్నది నిజం. కాని నెహ్రూ, అంబేద్కర్ ఇద్దరు కలిసి సంవిధాన్ సభలో మూడు సంవత్సరాలు కలిసి పని చేశారన్నది మరిచిపోతుంటారు. ఈ సందర్భంగా అనేక విషయాలపై ఇద్దరి మధ్య ఏకాభిప్రాయమూ ఉండవచ్చు. భేదాభిప్రాయమూ ఉండవచ్చు. రాజ్యాంగసభలో చర్చలను పరిశీలిస్తే సభ్యులందరు తమ అభిప్రాయాలను చాలా స్పష్టంగా చెప్పారన్నది తెలుస్తోంది. సుప్రీం లీడర్ చెప్పిందే వేదం అనే వైఖరి అప్పట్లో లేదని కూడా తెలుస్తుంది.

అమిత్ షా చెప్పినట్లు నెహ్రూ మంత్రివర్గం నుంచి అంబేద్కర్ రాజీనామా చేసిన మాట వాస్తవం. కాని అమిత్ షా అప్పట్లో అంబేద్కర్ ఏ కారణంతో రాజీనామా చేశారో చెప్పలేదు. హిందూకోడ్ బిల్లు వల్ల అంబేద్కర్ రాజీనామా చేశారు. కాని అమిత్ షా ఈ విషయం చెప్పకుండా విదేశీ వ్యవహారాలు, అధికరణ 370పై అసమ్మతి ప్రధాన కారణాలుగా చూపించారు. ఆనంద్ తెల్తుంబే రాసిన పుస్తకంలో అధికరణ 370 గురించి ప్రస్తావన ఉంది. ప్రభుత్వ విధానాలపై అంబేద్కర్ అసమ్మతిని వ్యక్తం చేస్తూ చెప్పిన మాటలు అందులో ఉన్నాయి. కాని ఇదే ఆయన రాజీనామాకు ముఖ్యకారణం అన్నట్లు అమిత్ షా చెప్పారు. కాని అంబేద్కర్ తన రాజీనామా లేఖలో ముఖ్యకారణం హిందూకోడ్ బిల్లు అని చెప్పారు. హిందూకోడ్ బిల్లుకు వ్యతిరేకంగా అప్పట్లో చాలా ప్రదర్శనలు కూడా జరిగాయి.

ఆరెస్సెస్ హిందూ కోడ్ బిల్లును ఎందుకు వ్యతిరేకించిందో అమిత్ షా చెప్పలేదు. అలాగే అంబేద్కర్ కు నెహ్రూ రాసిన లేఖలో ఏం రాశారో కూడా అమిత్ షా ఎందుకు చెప్పలేదు. నెహ్రూతో అంబేద్కర్ కు అభిప్రాయభేదాలుండేవి, వైమనస్యాలుండేవన్నది నిజమే. కాని చారిత్రక సంఘటనలను సరయిన దృష్టికోణంలో చూడాలి. వారిద్దరు సుదీర్ఘకాలం కలిసి పనిచేశారన్నది మరిచిపోరాదు. నెహ్రూకు చాలా మంది నేతలతో అభిప్రాయభేదాలుండేవి. అప్పట్లో అభిప్రాయ భేదాలను స్పష్టంగా ప్రకటించేవారు. ప్రజాస్వామికంగా చర్చలు జరిగేవి. భేదాభిప్రాయాలను భరించలేనితనం, స్ట్రాంగ్ లీడరు, ఆయన చెప్పిందే వేదం అనే స్థితి అప్పట్లో లేదన్నది కూడా మరిచిపోరాదు. అంబేద్కర్ విషయంలో మాట్లాడుతున్నప్పుడు చాలా విషయాలు చర్చించుకోవాలి. 'ది హిందూ' ప్రకారం దేశంలోని ఐఐటిల్లో, ఐఐఎంలలో ఫాకల్టీ లో దళితుల ప్రాతినిథ్యం ఇప్పుడు ఎంత తగ్గిందో స్పష్టంగా తెలుస్తోంది. అంబేద్కర్ పట్ల నిజాయితీ ఉంటే ఆయన భావజాలం పట్ల కూడా నిజాయితీ ఉండాలి. హిందూరాష్ట్ర గురించి అంబేద్కర్ ఏం చెప్పారో ఆ మాటలు కూడా అమిత్ షా చెప్పవల సింది. కాని ఆయన కేవలం కొన్ని మాటలనే ఎంచుకుని బీజేపీకి అనుకూలంగా చెప్పడానికి ప్రయత్నించారు. ఇప్పుడు అమిత్ షా తన ప్రసంగంలో కొన్ని మాటలనే ఎంచుకుని కాంగ్రెస్ ప్రతిపక్షాలు తనపై దాడి చేస్తున్నాయని అంటున్నారు.

ఇప్పుడు అమిత్ షా రాజీనామా చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. నిన్నటి వరకు కాంగ్రెస్ అదానీపై ఒంటరి పోరాటం చేస్తున్నట్లు కనిపించింది. కాంగ్రెస్ సంవిధాన్ బచావ్ పోరాటంలో కాంగ్రెస్ వెంట నడిచిన ప్రతిపక్షాలు, అదానీ విషయంలో కాంగ్రెసును వదిలేశాయి. కాంగ్రెస్ ఒంటరిగానే నిలబడింది. కాని ఇప్పుడు అమిత్ షా పుణ్యమా అని మరోసారి ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. అంబేద్కర్‌ను అవమానించిన బీజేపీకి రాజ్యాంగం పట్ల నిబద్ధత లేదని దాడి చేయడానికి అవకాశం దొరికింది.

కాంగ్రెస్ ఈ అవకాశాన్ని వదులుకోలేదు. అంబేద్కర్ విషయంలో అమిత్ షా చేసిన వ్యాఖ్య దళిత సముదాయంలో ఆగ్రహావేశాలకు కారణమవుతుందంటే తప్పులేదు.

ఇప్పుడు బీజేపీ, అమిత్ షా డిఫెన్సివ్ అయిపోయారనే చెప్పాలి. అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడిపోయేలా కాంగ్రెస్ చేసిందనేది మరో విమర్శ. అటల్ బిహారీ వాజపేయి ఎన్నికల్లో ఓడిపోవడానికి కారణం మాధవరావు సింధియా. ఇప్పుడు మాధవరావు సింధియా కుమా రుడు జ్యోతిరాదిత్య బీజేపీలో ఉన్నాడు. గమనించవలసిన మరో విషయమేమిటంటే, వేరే పార్టీలో ఉన్నప్పటికీ తన మంత్రివర్గంలో న్యాయశాఖమంత్రిగా చేయడం అన్నది ఎవరు చేశారు? నెహ్రూ చేశారన్నది చరిత్ర చదివితే తెలుస్తుంది. నెహ్రూ అధికారంలో వచ్చినప్పుడు దేశంలో హిందూ ముస్లిం ఘర్షణల వాతావరణం ఉంది. హిందూత్వ బాట పట్టి ఉన్నట్లయితే నెహ్రూ ఇప్పటి నాయకుల మాదిరిగా గొప్ప రాజకీయ లాభాలు పొంది ఉండేవారు. కాని ఆయన అలా చేయలేదు. విలువల రాజకీయాలకు కట్టు బడ్డారని మనోజ్ ఝా చెప్పిన మాటల్లో నిజం ఉంది. హిందూ ముస్లిం వైమనస్యాల వాతావరణాన్ని నెహ్రూ తొలగించారు. దేశంలో మతతత్వ మబ్బులు విడిపోయేలా చేశారన్నది కూడా నిజం.

ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వం కూడా ఆ భావజాలాన్ని ప్రతిఫలి స్తుందా? సాఫ్ట్ హిందూత్వ రాజకీయాల నుంచి బయటపడు తుందా? ప్రియాంక గాంధీ ఫ్రీ పాలస్తీన్ అనే బ్యాగు తీసుకుని వెళ్ళడం ద్వారా ఈ విషయాన్ని స్పష్టంగానే ప్రకటించారని చెప్పాలి. అలాగే బంగ్లాదేశ్ అల్పసంఖ్యాకులకు న్యాయం చేయాలన్న బ్యాగు తీసుకురావడం ద్వారా మరో సందేశాన్ని స్పష్టంగా ఆమె ప్రకటిం చారు. అలాగే ఇప్పుడు పార్లమెంటులో కూడా పరిస్థితి మారుతోంది. అదానీ పేరెత్తితే బయటకు గెంటేసే పరిస్థితి మారి ఇప్పుడు ప్రసంగాల్లో అదానీ ప్రస్తావనలను వినక తప్పని పరిస్థితి వచ్చింది. అదానీ విషయంలో ప్రియాంక గాంధీ స్పష్టంగా మాట్లాడారు. స్పీకర్ కూడా అభ్యంతరపెట్టడం ఈ సారి జరగలేదు. ప్రతిపక్షాలు ఎంత బలంగా ఉన్నయో చెప్పే పరిస్థితి ఇది. ఈ నేపథ్యంలో అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్య దేశంలో రాజకీయ సమీకరణాలను మార్చే వ్యాఖ్యగా నిలుస్తుందా? వేచిచూద్దాం. ☒

## వచ్చే వారం నుండి ప్రత్యేకం

**"ఇస్లామీయ ఉద్యమం - దాని కృషి"** అనే మకుటంతో గీటురాయి సంపాదకులు **శ్రీ ఎస్.ఎమ్. మలిక్** వ్రాసిన సైద్ధాంతిక రచన **3-1-2025** సంచిక నుండి ధారావాహికంగా గీటురాయి పత్రికలో రానున్నదని తెలియ జేయడానికి సంతోషిస్తున్నాము.




**అమ్మ పెట్టా పెట్టదు... అడుక్కు తినా తిననివ్వదు**

ఇది తెలుగు సామెత. ఈ సామెతకు అర్థం వివరించవలసిన అవసరం లేదు. చక్కని అర్థమున్న తెలుగు సామెతల్లో ఇదొకటి

ఈ సామెత ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే -

అంతకన్నా ముందు మరో సామెత ఉంది.

పిల్లికి బిచ్చం పెట్టని వాడన్నది ఆ సామెత. బిచ్చం పెట్టడం దానం చేయడం అన్నది ఒక మంచిపనిగానే సమాజం భావిస్తూ వచ్చింది. వేమన అయితే కాస్త ఘాటుగా ఇలా అన్నాడు -

పెట్టిపోయలేని పట్టి నరులు భూమి

బుట్టనేమి వారు గిట్టనేమి

పుట్టలోన జెదలు పుట్టదా గిట్టదా

విశ్వదాభిరామ వినుర వేమ..!

కాబట్టి దానధర్మాలు చేయాలని మన నీతిశాస్త్రాలు, ధర్మశాస్త్రాలు కూడా చెబుతున్నాయి. కాని ప్రభుత్వం మాత్రం వద్దంటుంది.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఉంది. ఇండోర్ మధ్య ప్రదేశ్‌లో ఉంది. ఇండోర్ వెళితే పొరపాటున కూడా ఎవరికీ, వారెన్ని కష్టాల్లో కనబడి అడుక్కుంటున్నా దానం చేయకండి. పోలీసులు అరెస్టు చేసి జైల్లో కూర్చోపెడతారు. జనవరి 1వ తేదీ నుంచి ఇండోర్‌లో ఎవరైనా దానధర్మం అంటూ యాచకులకు దానాలు చేస్తే వారిపై పోలీసు కేసు పెట్టే చట్టం వచ్చింది.

ఇండోర్ పట్టణాన్ని బిచ్చకరహిత పట్టణంగా మార్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నారట. బిచ్చక రహిత పట్టణంగా మార్చడమంటే, దానధర్మాలు చేసే ఉదార హృదయం లేకుండా చేయడమా, బిచ్చగాళ్ళు కనబడకుండా చేయడమా, లేక బిచ్చమెత్తే పరిస్థితి లేని శ్రేయోరాజ్యాన్ని సాధించడమా?

అప్పుడప్పుడు మనం కొన్ని విచిత్రమైన కథలు వింటాం. అవి నమ్మశక్యం కానట్లు అనిపిస్తాయి. మొన్నీమధ్యనే ఒక వార్తలో భిక్షాటనను వృత్తిగా చేసుకుని కోట్లు సంపాదించిన వారి గురించి వచ్చింది. ఎకనమిక్ టైమ్స్‌లో కొందరు కోట్లు సంపాదించిన బిచ్చగాళ్ళ ఇంటర్వ్యూలు కూడా వచ్చాయి.

నిజమే. భిక్షాటనను వృత్తిగా అంగీకరించలేము. సోమరి పోతులై పనీపాట చేయకుండా అడుక్కుతిన్నంత సుఖం లేదనుకునే వారికి బిచ్చమేయరాదు. అపాత్రదానం అనర్థదాయకం. కాని నిజంగా అవసరంలో ఉండి, ఆకలితో ఉండి అడుక్కుంటున్న వారిని చూసి కూడా దానం చేయకుండా ఉండాలని చెప్పడంలో మానవత్వం ఉందా?

నిజానికి భిక్షాటనపై, బిచ్చగాళ్ళపై వ్యతిరేకత చాలా కాలంగానే ఉంది. 2018లో ఢిల్లీ హైకోర్టు బాంబే ప్రివెన్షన్ ఆఫ్ బెగ్గింగ్ చట్టంలోని సెక్షన్లను కొట్టేసింది. నిజానికి 'ప్రివెన్షన్ ఆఫ్ బెగ్గింగ్' యాచించడాన్ని నేరంగా చూస్తుంది. ఇప్పుడు ఇండోర్ అధికారులు దానమిచ్చినా నేరంగా చూస్తారు. ఇది నవభారతం.



నిస్సందేహంగా దేశంలో సోమరిపోతులై అడుక్కుతిని ఆస్తులు కూడబెట్టే వాళ్ళు చాలా మంది ఉండవచ్చు. నిస్సందేహంగా చిన్నపిల్లల్ని పసివాళ్ళను అడుక్కునేలా చేసి, వారిని వికలాంగులు చేసి బిచ్చమెత్తించే మాఫియా గ్యాంగులు కూడా పని చేస్తుండవచ్చు. కాని వీటన్నింటినీ నిరోధించవలసిన బాధ్యత శ్రేయోరాజ్యంలో ప్రభుత్వానిది. కాని ఈ బాధ్యత ప్రభుత్వం నిర్వర్తిస్తుందా?

నిస్సహాయస్థితిలో బిచ్చమెత్తేవారి పరిస్థితి ఏమిటి? ఎవరో కొందరు బెగ్గింగ్ కోటీశ్వరులున్నారన్న సాకుతో, ఎవరో కొందరు బెగ్గింగ్ మాఫియా ఉన్నారన్న సాకుతో రోడ్లపై దీనంగా బిచ్చమెత్తుకుంటున్న పిల్లలను, పెద్దలను, ఎముకలు కొరికే చలిలో ఫుట్‌పాత్‌పై పడుకుంటున్న అభాగ్యులను నేరస్తులుగా చూడగలమా? వారికి శక్తిమేరకు దానమిచ్చే వారిని నేరస్తులుగా అరెస్టు చేయగలమా?

ఒక్కసారి ఆలోచించండి. దేశంలో ఎంతమంది తల దాచుకోడానికి గూడులేని వారున్నారు. వారి గురించి ఆలోచించవలసిన బాధ్యత ఎవరిది? వారికి గౌరవంగా బతికే హక్కు కల్పించడం ప్రభుత్వం బాధ్యత కాదా?

దేశంలో లక్షలాది మంది యాచకులున్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో యాచించడం నేరం. ఇప్పుడు బీజేపీ వారి మధ్యప్రదేశ్‌లో దానం చేయడం కూడా నేరం.

అసలు ఇంతమంది ఎందుకు అడుక్కుతింటున్నారన్నది ప్రభుత్వం ఎప్పుడైనా ఆలోచించిందా? యాచకవృత్తిలో జీవిస్తున్నవారు కూడా ఉన్నారు. ఏదో ఒక పని చేసుకు బతకొచ్చు కదా అని చెప్పడం చాలా తేలిక. నగరాల్లో పాచిపని చేసుకోవాలన్నా, పోలీసు క్లియరెన్సు కూడా అవసరమవుతుంది. ఆయా ప్రాంతాల్లో పాచిపని చేస్తున్న వారి ప్రాబల్యం ఉంటుంది. కొత్తవారికి పని ఇవ్వడానికి సంకోచించే మనస్తత్వము ఉంటుంది. చాలా పనులున్నాయి చేయడానికి అని చెప్పడం ఎంత తేలికో, క్షేత్రస్థాయిలో దిగి పనులు వెదికి చూపించడం అంతే కష్టం.

చిన్నపిల్లలు, వయోవృద్ధులకు ఇది మరీ కష్టం. ఇలాంటి వారు ఏమి చేయాలి. ప్రభుత్వం వారి కోసం ఏం చేస్తోంది? అసలు బిచ్చగాళ్ళు సమాజంలో ఉన్నారంటే కారణం సమాజమే. చాలా మంది బిచ్చగాళ్ళు శారీరకంగా కష్టపడే స్థితిలోనే ఉంటారన్నది నిజమే. కాని వారికి పని చూపించేది ఎవరు? గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం తీసుకురావలసిన అవసరం ఎందుకు వచ్చిందో ఒక్కసారి ఆలోచిస్తే పనులు వెదుక్కోవడం ఎంత కష్టమో కూడా అర్థమవుతుంది.

పెద్దలు బిచ్చమెత్తితే, అది చూసి పిల్లలు కూడా అదే చేస్తారు. తండ్రి తాగుబోతు అయితే ఆ పిల్లలు ఏం చేయగలరు? మద్యాన్ని ప్రభుత్వం నిషేధించి రెవిన్యూ కోల్పోడానికి సిద్ధంగా లేదు. తలదాచుకునే ఇల్లు లేని ఒంటరి తల్లుల పిల్లలు ఏం చేస్తారు? ఇంట్లో సరయిన భద్రత లేని పిల్లలు ఏం చేస్తారు?

సరే దానధర్మాలు చేయవద్దని, కేసులు పెట్టి అరెస్టులు చేస్తామని చెబితే చాలా మంది దానధర్మాలు చేయకుండా ఆగిపోతారు. దానివల్ల ఈ సమస్య పరిష్కారమవుతుందా? తినడానికి తిండి లేక ఆకలితో అలమటిస్తున్నవాళ్లు, పిల్లలైనా, వయో వృద్ధులైనా, కాలుచెయ్యి సక్రమంగా ఉన్న యువకులైనా సరే ... ఏం చేస్తారు? ఆకలితో చస్తారా? లేక పొట్ట నింపుకోడానికి ఏమైనా చేస్తారా? ఇక్కడ ఏమైనా చేస్తారా? అనే ప్రశ్న అనేక సామాజిక ప్రశ్నలకు కారణమవుతుందని లోతుగా ఆలోచించాలి.

బెగ్గింగ్ మాఫియా ఉంది. పిల్లల్ని బిచ్చగాళ్ళుగా మార్చే వాళ్ళున్నారు, బిచ్చగాళ్ళలో కోటీశ్వరులున్నారు... ఈ మాటలన్నీ నిజమే. కాని వీటన్నింటిని అడ్డుకునే బాధ్యత ప్రభుత్వానిది. ఆ పని ప్రభుత్వం చేయాలి.

తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలు. అనాథాశ్రయాల్లో నానా కష్టాలు పడలేక పారిపోయే పిల్లలు. తండ్రి తాగుబోతైతే ఇంట్లో తినడానికి ఏదీ దొరకని పిల్లలు. ఒంటరి తల్లి సాకలేనందువల్ల రోడ్డున పడిన పిల్లలు. తలదాచుకునే గూడు లేని అభాగ్యులు. సంతానం పట్టించుకోనందువల్ల, కష్టాలు పెట్టినందువల్ల రోడ్డున పడిన పెద్దలు... ఇలాంటి వారి పరిస్థితేమిటి? వారిని ప్రభుత్వం ఆదుకుంటుందా? ఇలాంటి వారిని సక్రమంగా ప్రభుత్వం ఆదుకుని ఆ తర్వాత దానధర్మాలు చేయడం నేరం అని చెబితే బాగుండేది.

సుప్రీంకోర్టు 2021లో భిక్షాటనపై ఒక తీర్పు చెప్పింది. భిక్షాటన నిషేధానికి సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. ఇది సామాజిక ఆర్థిక సమస్య. దీన్ని చట్టాలు చేసి పరిష్కరించడం కుదరదు. వరకట్న సమస్యపై చట్టం చేసి సాధించిందేమిటి? సామాజిక సమస్యను సామాజిక స్థాయిలో పరిష్కరించాలి. ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు ఆదుకుంటే బిచ్చగాళ్ళ సంఖ్య తగ్గిపోవడమే కాదు, కోటీశ్వరులైన బిచ్చగాళ్ళ అసలు రూపం కూడా బట్టబయలవుతుంది. బిచ్చగాళ్ళలో కొందరు కోటీశ్వరులున్నారనే సాకుతో అభాగ్యులను నేరస్తులు చేయలేం. ప్రతి నగరంలో కనిపిస్తున్న అనేకమంది బిచ్చగాళ్ళ పూర్వాపరాలు పరిశోధించడం ఏమంత కష్టం కాదు. ప్రభుత్వం తలచుకుంటే ఒక సర్వే చేయించి ఎంతమంది బిచ్చగాళ్ళు కోటీశ్వరులో గణాంకాలు బయటకు తీయగలదు. వారందరిపై చర్యలు తీసుకోగలదు.

ప్రవక్త ముహమ్మద్(స) భిక్షాటన విషయమై చెప్పిన మహితోక్తులు ఇక్కడ సామాజిక మార్పును సాధించే పనిముట్లుగా కనిపిస్తాయి.

"(బిచ్చమెత్తి) తనను తాను అవమానించుకోవడం ఒక విశ్వాసికి శోభించదు" (తిర్మిజి)

"ఎల్లప్పుడు బిచ్చమెత్తేవాడు తీర్పుదినాన తన ముఖంపై మాంసం లేని స్థితిలో లేచి వస్తాడు"

"తన సంపద పెంచుకోడానికి బిచ్చమెత్తేవాడు కణకణలాడే నిప్పుకణికలు అడుక్కుంటున్నాడు" (ముస్లిం)

"కష్టపడి తన చేతులతో సంపాదించి తినేదే అత్యుత్తమమైన భోజనం" (బుఖారి)

సమాజంలో మార్పు తీసుకువచ్చే బోధనలివి. కాని, తీవ్రమైన నిస్సహాయ స్థితిలో, అవసరమున్న వారిని ఆదుకోడానికి కావలసిన ఏర్పాట్లు కూడా ఇస్లాం చేసిందన్నది మరిచి పోరాదు.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# మంచిని పెంచాలి


- నసీరా బేగం

ఒక మనిషి మంచి విషయాన్ని గనక చూసినట్ల యితే లేదా ఆచరించినట్లయితే దానిని ఇతరులకు చూపించటం మనిషి స్వభావం. దాని కారణంగానే అతను తన నిజ ప్రభువును గ్రహించి, ఆయన్ని విశ్వసించి ఆయన ఆజ్ఞలను పాలిస్తున్నప్పుడు, సన్మార్గంపై నడుస్తున్నప్పుడు ఈ మార్గాన్ని ఇతరులకు చూపాలని ఉవ్విళ్ళూరుతాడు. ఇది తన కర్తవ్యంగా భావిస్తాడు. దానికోసం కృషి చేస్తాడు. ఎవరైనా ఒకవేళ అలా చెయ్యకపోయినట్లయితే అతను తన స్వభావాన్ని అణిచివేస్తున్నాడన్న మాట. దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడన్నమాట. ఎందుకంటే సమాజంలో మంచి మనుషులు ఉంటారు, చెడ్డ మనుషులూ ఉంటారు. చెడ్డ మనుషులు అన్యాయాలు, దౌర్జన్యాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఉంటారు. మంచి మనుషులు వీటిని చూసీ చూడకుండా ఊరుకుండిపోతే, తాము మంచిగా ఉన్నాముగా అదే చాలు అని భావించి ఊరకుండిపోతే చెడు ప్రబలి పోయి, మంచి నశించిపోతుంది. రాబోయే తరాలు ఆ చెడు వాతా వరణంలో ఇమడలేక, బ్రతకలేక, ఊపిరాడక అష్టకష్టాలు పడతారు. కనుక మనిషి తన రాబోయే తరాల వారిని గురించి అయినా ఆలోచించి అతను మంచిని వ్యాపించటానికి కృషి చెయ్యటం తప్పనిసరి.

దేవుడు ఎన్నుకున్న దైవప్రవక్తలు మంచినంతటిని ఆచరించి ప్రజలను తన వైపునకు ఆహ్వానించి దైవమార్గాన్ని పరిచయం చేశారు. దేవుడు ఉన్నాడని, ఆయనే అల్లాహ్ అని, ఆయన ఒక్కడని, తను ఆయన పంపిన ప్రవక్త అని, మరణానంతరం మరొక జీవితం ఉందని, అందులో సాఫల్యం పొందటమే అసలు సాఫల్యమని, స్వర్గ నరకాలు ఉన్నాయని, ఈ విషయాల గురించి భయపడమని బోధించారు. తాము ఎవరికీ జవాబుదారులము కాము అనే ధీమాతో ఇష్టానుసారంగా, విచ్చలవిడిగా జీవితం గడుపు తున్న ప్రజలు ప్రవక్తను, ప్రవక్త బోధనలను అడ్డుగా భావించి వారినే తొలగించాలని దౌర్జన్యం చేశారు. న్యాయానికి అన్యాయం ఢీకొని అన్యాయమే తునాతునకలయ్యింది కాని న్యాయం నశించ లేదు. అన్యాయమే నశించింది, న్యాయమే గెలిచింది. ఎవరి హృదయాలలో రవ్వంతైనా మార్గదర్శకత్వాన్ని పొందాలనే కాంక్ష ఉండేదో, వారు ఏ మూలన వున్నా అల్లాహ్ వారికి మార్గదర్శ కత్వాన్ని ప్రసాదించాడు. ఎవరి హృదయాలలోనైతే ఆ రవ్వంత మంచి కూడా లేదో అల్లాహ్ వారికి వారి చెడు కార్యాలలో కూరుకు పోయేలా చేశాడు. చివరకు వారు అదే స్థితిలో మరణాన్ని కౌగిలించుకున్నారు. వారి ఇహపరలోకాలు రెండూ సర్వనాశనమై పోయాయి. ఎందుకంటే, అల్లాహ్ ప్రవక్తలను కూడా ఒక విషయాన్ని ఆజ్ఞాపించాడు. నా సందేశాన్ని ప్రజల వరకు చేరవెయ్యటమే మీ పని. ఎవరినీ బలవంతం చేసే హక్కు మీకు లేదు. ఒకవేళ ఎవరైనా ఈ మంచి కార్యానికి అడ్డుపడి మంచి ప్రబలకుండా ఆపినట్లయితే వారిని ఎదుర్కోవచ్చు. స్వయంగా మీరు తమ వైపు నుంచి ఎవరినీ నష్టానికి, కష్టానికి గురిచెయ్యకూడదు. అందరితో మానవత్వంతో మంచిగా వ్యవహరించి వారి ధన మాన ప్రాణాలను కాపాడండి. వాటిని ఎలాంటి నష్టమూ వాటిల్లకుండా చూడండి. ఎందుకంటే అందరూ ఒకే తల్లికి, ఒకే తండ్రికి పుట్టిన సంతానం. కనుక వారు అదేవిధంగా చేశారు.

అయితే దైవప్రవక్తల పరంపర ఆగిపోయిన తరువాత ఈ బాధ్యత ఎవరిపై ఉంది? అనే విషయం తెలుసుకోవాలి. అల్లాహ్ దైవప్రవక్తల తరువాత ఈ బాధ్యత ముస్లిములపై ఉంది అని ఆదేశించాడు. ఎవ్వరూ చెడును చూసి కూర్చోరాదు. శక్తిమేరకు దాన్ని రూపుమాపటానికి కృషి చెయ్యాలి. ఈ విషయంలో ఒకరికొకరు తోడు నీడగా నిలవాలి అని అన్నాడు. దీనిని దివ్య ఖుర్ఆన్‌లో ఆయన ఇలా సెలవిచ్చాడు; ''కాలం సాక్షిగా! నిస్సందేహంగా మానవుడు పెద్ద నష్టానికి గురై ఉన్నాడు. విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండేవారు, ఒకరికొకరు సత్యోపదేశం సహన బోధ చేసుకునేవారూ తప్ప.'' (103)

మొట్టమొదట ఒక సందేశ ప్రచారకుడు అల్లాహ్‌ను దృఢంగా విశ్వసించాలి. దివ్య గ్రంథాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుంటూ చదవాలి. అందులో అల్లాహ్ ఒక్కో విషయాన్ని తన దాసుడు అర్థం చేసుకోవాలని పలుమార్లు, పలు విధాలుగా ప్రస్తావించాడు. అందులో అల్లాహ్ ఇచ్చిన ఆజ్ఞలన్నీ తు.చ తప్పకుండా ఆచరిం చాలి. అందులోని ఆజ్ఞలన్నీ చాలా సులువైనవిగా ఉంటాయి. మనిషి తన మనస్సుపై అదుపును సాధిస్తే చల్లని గాలి మనిషిని ఎంతటి హాయిని ప్రసాదిస్తాయో ఆ ఆజ్ఞలన్నీ మనిషికి అంతటి హాయిని, సుఖాన్ని ప్రసాదిస్తాయి. ఆ తరువాత తనను తాను పూర్తిగా సంస్కరించుకుని ప్రజలలోకి రావాలి. తన మాట, తన చేష్టలు మధురమైన తేనె మాదిరిగా, కస్తూరి వంటి సువాసన వెదజల్లేదిగా ఉండాలి. అతన్ని చూసిన వెంటనే అతనిచ్చే సందేశం వైపు ప్రజలు ఆకర్షితులవ్వాలి. ఇంకా అతను అత్యంత వివేకంతో, మృదు భాష్యంతో వ్యవహరించాలి. సమయాన్ని పాలిస్తూ, ఆజ్ఞలన్నింటినీ ఆచరిస్తూ సమానత్వం, సోదరభావం వెల్లివిరిసే విధంగా ఆరాధనలు చేయాలి. కష్టాలలో ఉన్న ప్రజలను మతాలకతీతంగా మానవత్వాన్ని ప్రదర్శిస్తూ నేడు మన ముస్లిమ్ సోదరులు చేస్తున్న విధంగా సేవలందించాలి, ఆదరించాలి. దైవాన్నే మరిచి పోయి జీవితాలు గడుపుతున్నవారికి దేవుడు ఉన్నాడని, ఆయన ఒక్కడని, ఆయన నుంచి తప్పించుకోవటం అసంభవమని విడమర్చి చెప్పాలి. మరణానంతరం మరొక జీవితం ఉందని విశ్లేషించి చెప్పాలి. ఎవరికైనా అన్యాయం జరుగుతుంటే వారికి న్యాయం చేకూర్చే విధంగా కృషి చెయ్యాలి. దైవగ్రంథమైన దివ్య ఖుర్ఆన్ అందరికీ చేరవెయ్యాలి. ప్రేమను పంచాలి, గౌరవాన్నివ్వాలి, సమానంగా వ్యవహరించాలి.




# మత సామరస్యం కోసం కడదాకా కృషి చేసిన గాంధీజీ

**భాస్కర్**

**భారత దేశం**లో మతాల మధ్య సామరస్యం కోసం కృషి చేసిన మహనీయుల్లో గాంధీజీ ఒకరు. హిందువులు- ముస్లింల ఐకమత్యం కోసం, వారి మధ్య సామరస్యం కోసం కడదాకా తన వంతు పాటుపడ్డారు. జనవరి 18, 1948న, తాను హత్య కావడానికి మూడు రోజుల ముందు, తన ఆఖరి ఉపవాస దీక్ష పూర్తి చేసిన తొమ్మిది రోజుల తర్వాత, గాంధీ ఢిల్లీలోని కుతుబుద్దీన్ భక్తియార్ కాకీ దర్గాను సందర్శించారు. ఢిల్లీలో శాంతి, సామరస్యాలను నెలకొల్పాలనే ఉద్దేశంతో ఆయన ఈ పని చేశారు. స్వతంత్ర భారతదేశంలో మత విద్వేషాలు చెలరేగినప్పుడు హిందూ-ముస్లింల మధ్య సమైక్యత, సామరస్యాన్ని కాపాడటానికి గాంధీజీ తన జీవితాన్ని పణంగా పెట్టారు. అలాంటి మహాత్ముడు ఓ మతోన్మాది చేతిలో ప్రాణాలు కోల్పోవాల్సి రావడం విషాదకరం.

మత విద్వేషాగ్నుల వల్ల రేగిన హింసలో తీవ్రంగా నష్టపోయిన ముస్లిములను కుతుబుద్దీన్ భక్తియార్ కాకీ దర్గాలో కలిసిన గాంధీజీ వారికి ధైర్య వచనాలు చెప్పారు. మౌలానా ఆజాద్, అమృత్ కౌర్ ఆయన వెంట ఉన్నారు. గజగజ వణికిస్తున్న చలిని లెక్క చేయకుండా ఉదయం ఎనిమిది గంటల కంటే ముందే వారు దర్గాకు చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడ వార్షిక ఉర్సు జరుగుతున్నది. దర్గాపై దాడి జరగడంతో ఆ ఏడాది ఉర్సు ఉత్సవాలకు పెద్ద ఎత్తున ముస్లిములు రాలేదు. దర్గా ఉద్యోగులు కూడా ప్రాణ భయంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా అక్కడి ముస్లింలతో గాంధీజీ మాట్లాడారు. ఆ తర్వాత దేశంలో మతం పేరుతో ముస్లింలపై దాడులు జరగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దర్గా పరిసరాల్లోని ప్రజలంతా శాంతి యుతంగా జీవించాలని విజ్ఞప్తి చేశారు. అల్లర్ల వల్ల దర్గా తీవ్రంగా ధ్వంసమవడంతో మరమ్మతులు చేయించాలని ప్రధాని నెహ్రూను కోరారు. దర్గాకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు రూ.50 వేలు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. కుతుబుద్దీన్ భక్తియార్ కాకీ దర్గాతో

గాంధీజీకి ఉన్న అనుబంధాన్ని తెలిపేలా ఎలాంటి శిలాఫలకం లేకపోవడం దురదృష్టకరం.



దర్గా సందర్శన తర్వాత గాంధీజీ ఇలా వ్రాశారు: 'అజ్మీర్ దర్గా తర్వాత, ఇది దేశంలో రెండో అత్యంత ప్రతిష్టాత్మక దర్గా (కుతుబుద్దీన్ భక్తియార్ కాకి). ఈ దర్గాను ప్రతి సంవత్సరం వేలాది మంది ముస్లింలతో పాటు, ఇతర మతస్థులు కూడా దర్శిస్తారు. నేను తీర్థయాత్ర కోసం ఇక్కడికి వచ్చాను. ఇక్కడికి వచ్చిన హిందూ, ముస్లిం, సిక్కులు ఎప్పుడూ సంఘర్షణ పడకుండా, స్నేహపూర్వకంగా, సోదర భావంతో కలిసిమెలిసి ఉంటామని ప్రతిజ్ఞ చేయాలని నేను అభ్యర్థిస్తున్నాను. మనల్ని మనం శుద్ధి చేసుకోవాలి. ప్రత్యర్థులను సైతం ప్రేమతో కలవాలి.' ఢిల్లీలో మత సామరస్యాన్ని పెంపొందించేందుకు కుతుబుద్దీన్ భక్తియార్ కాకీ దర్గా ఏటా శీతాకాలంలో 'ఫూల్ వాలా కి సేర్' పేరుతో సామూహిక వార్షిక ఉత్సవాలు నిర్వహిస్తున్నది. భారతదేశం లౌకిక విలువలతో జీవించాలని ఉద్ఘాటించిన గాంధీజీకి ఈ ఉత్సవాలు నిజమైన నివాళి వంటివి. బ్రిటీష్ పాలనలో 1862లో నిలిపేసిన ఈ వారం రోజుల పండుగను స్వాతంత్ర్యానంతరం నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1961లో పునఃప్రారంభించారు. ఈ పండుగ సందర్భంగా హిందువులు, ముస్లింలు దర్గాలో చాదర్‌లు సమర్పిస్తారు.

సీనియర్ ఢిల్లీ జర్నలిస్ట్, చరిత్రకారుడు వివేక్ శుక్లా ప్రకారం 1915 నుండి 1948 వరకు గాంధీజీ ఢిల్లీలో 744 రోజులు బస చేశారు. స్వతహాగా ఆస్తికుడైన ఆయన ఈ సమయంలో కేవలం రెండు మత ప్రార్థనా మందిరాలను మాత్రమే సందర్శించారు. వాటిలో రెండవది కుతుబుద్దీన్ భక్తియార్ వారి దర్గా. అజ్మీర్ షరీఫ్ దర్గాను దేవాలయంగా గుర్తించాలని చెప్తున్న వారు ఒకటి తెలుసుకోవాల్సిందేమిటంటే... మహాత్మా గాంధీ అజ్మీర్ షరీఫ్‌లోని ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ దర్గాను సందర్శించారు. ఈ దర్గాను 'మానవత్వానికి కేంద్రం'గా అభివర్ణించారు. ఆయన 1921, 1922, 1934లో మూడుసార్లు అజ్మీర్ షరీఫ్ (రాజస్థాన్)ని సందర్శించారు.

**('ది వైర్' సౌజన్యంతో)**


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# పోలీసు బలగాలలో నామమాత్రంగానే ముస్లింల ప్రాతినిధ్యం

**- సల్మాన్ హైదర్**

**భారతదేశానికి** స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పోలీసు బలగాల్లో ముస్లింలు తొలిసారిగా అత్యల్ప స్థాయికి పడిపోయారని Muslims in India - Ground Reality Verses Fake Narratives - Achievements & Accomplishment అనే కొత్త పుస్తకంలో వెల్లడైంది..

అగ్రవర్ణ హిందువులు, ఎస్సీలు, ఎస్టీల కంటే ముస్లింలు వెనుకబడి ఉన్నారని జస్టిస్ రాజిందర్ సచార్ ఆశ్చర్యపరిచే నివేదిక వెల్లడి అయిన దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా సామాజిక, ఆర్థికంగా, ముస్లింలు పరిపాలనా రంగాలలో ప్రాతినిధ్యం అంశంలో ముస్లిములు వెనుకబడి ఉన్నారు.

తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక వంటి రాష్ట్రాల్లో మినహా దేశవ్యాప్తంగా పౌర, పోలీసు సేవల్లో ముస్లింల "స్థూల తక్కువ ప్రాతినిధ్యం" గురించి డాక్టర్ గోపాల్ సింగ్ కమిటీ మాట్లాడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని జనాభాలో 14.2 శాతం లేదా దాదాపు 172.2 మిలియన్ల జనాభా ఉన్న అతిపెద్ద మైనారిటీ కమ్యూనిటీ ముస్లిములకి ప్రభుత్వ సేవల్లో రిజర్వేషన్లను కల్పించాలని పిలుపునిచ్చింది. ముస్లిం కమ్యూనిటీ విస్తృత శ్రేణి ఆర్థిక, విద్యా, సామాజిక సవాళ్లు, కష్టాలు, లేమిలు అనేక రెట్లు పెరిగాయి. 2007లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా ఇచ్చిన నివేదిక కూడా ముస్లింలు వెనుకబడి ఉన్నారని నిర్ధారించింది.

ముస్లిం జనాభా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మునుపెన్నడూ చూడని రీతిలో హత్యలు, ద్వేషపూరిత నేరాలు, సామాజిక, ఆర్థిక వివక్ష వంటి సామాజికంగా కలతపెట్టే పరిణామాలను ఎదుర్కొంటున్నారు. ముస్లింలు పోలీసు, పారామిలటరీ సేవల్లో ప్రాతినిధ్యం కొరతను కూడా ఎదుర్కొంటున్నారు.

➢ 2023 సివిల్ లిస్ట్‌ల ప్రకారం 4344 మంది ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారుల్లో కేవలం 151 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు.

➢ 252 ఇండియా రైల్వేస్ ప్రొటెక్షన్ ఫోర్స్ సర్వీస్ (RPF) అధికారులలో 19 మంది ముస్లింలు ఉన్నారు.

➢ ఢిల్లీ, అండమాన్- నికోబార్ దీవులు, లక్షద్వీప్, డామన్ అండ్ డయ్యూ, దాద్రా అండ్ నగర్ హవేలీ (DANIPS) పోలీస్ సర్వీస్‌లకు చెందిన 248 మంది అధికారులలో ముగ్గురు ముస్లింలు మాత్రమే ఉన్నారు.

➢ పాండిచ్చేరి పోలీస్ సర్వీస్‌లో 47 మంది అధికారుల్లో ఒక్క ముస్లిం మాత్రమే ఉన్నారు.

➢ 26 రాష్ట్రాల్లోని రాష్ట్ర పోలీసు సర్వీసెస్‌లో 8,434 మంది అధికారుల్లో 387 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు.

➢ దేశంలో రెండవ అతిపెద్ద ముస్లిం జనాభా ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో 1,063 మంది పోలీసు అధికారులలో 17 మంది మాత్రమే ముస్లింలు.

➢ గోవా, జార్ఖండ్, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, సిక్కిం, త్రిపుర పోలీసు బలగాల్లో ముస్లిం అధికారులు లేరు.

➢ ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల 999 మంది డీజీపీలలో 27 మంది ముస్లింలు ఉన్నారు.

➢ ఢిల్లీ, హర్యానా, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, తెలంగాణ, తమిళనాడు సహా తొమ్మిది రాష్ట్రాల్లో ముస్లిం డీజీపీలు లేరు.

➢ పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో వరుసగా 38 మరియు 24 మందిలో ఇద్దరు ముస్లింలు పోలీసు చీఫ్‌లుగా ఉన్నారు.

➢ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ - అస్సాం రైఫిల్స్, సరిహద్దు భద్రతా దళం (BSF); సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (CISF), సశాస్త్ర సీమా బాల్ (SSB) లో 583 మంది సీనియర్ అధికారులలో 34 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు

➢ 1947 నుండి 2023 చివరి వరకు కేంద్ర సాయుధ దళాలకు చెందిన మొత్తం 35,409 మంది అమరవీరులలో 2,212 మంది ముస్లింలు ఉన్నారు.

➢ 27 రాష్ట్రాలు, యుటిల పోలీసు బలగాలలో 2023 వరకు మొత్తం 5128 మంది అమరవీరులలో 210 మంది ముస్లింలు ఉన్నారు.

➢ దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు అకాడమీల చీఫ్‌లు 294 మందిలో ముస్లింలు ఏడుగురు మాత్రమే ఉన్నారు..

➢ దేశవ్యాప్తంగా ఉన్న 380 పోలీస్ హౌసింగ్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్లకు కేవలం 13 మంది ముస్లిం అధికారులు చీఫ్‌లుగా ఉన్నారు.

➢ ప్రస్తుతం దేశంలోని 1,884 ఎస్పీలు, అదనపు ఎస్పీలలో 68 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు.

➢ 4,760 మంది డీఎస్పీలలో 124 మంది ముస్లింలు ఉన్నారు.

➢ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల (లా అండ్ ఆర్డర్) సంఖ్య దేశవ్యాప్తంగా మొత్తం 20,022 మందిలో ముస్లిములు 493 మంది ఉన్నారు.

➢ 2016లో IPSలో ముస్లింల వాటా 03% కి పడిపోయింది

➢ 1983లో మొత్తం 3,785 మంది ఐపీఎస్‌లలో 57 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు.

➢ 1981- 2000 మధ్య, IPS మొత్తం 3,284 మంది అధికారుల నియామకాన్ని చూసింది, అందులో కేవలం 120 మంది ముస్లింలు లేదా 3.65 శాతం మంది ఉన్నారు.

➢ అధికారిక గణాంకాల ప్రకారం, ఢిల్లీ పోలీసులోని మొత్తం 75,117 మంది అధికారులలో ముస్లిం పోలీసు అధికారులు కేవలం 1,521 మంది మాత్రమే.

➢ కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఏజన్సీలలో ఇంటెలిజెన్స్ బ్యూరో (IB), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇంటెలిజెన్స్ (CBI), అస్సాం రైఫిల్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లో దాదాపుగా ముస్లిం అధికారులు లేరు.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పొదురాయి
గీటురాయి
వారపత్రిక

➢ 2002 గణాంకాల ప్రకారం, IPS అధికారులలో ముస్లింలు కేవలం 3.65 శాతం మాత్రమే ఉన్నారు.

➢ పోలీసు బలగాలలో ముస్లిం ప్రాతినిధ్య పరంగా అధ్వాన్నమైన రాష్ట్రాలు- ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ముస్లింలు వరుసగా 4.5, రెండు శాతం పోలీసు బలగాలకు ప్రాతినిధ్యం వహించారు..

➢ పోలీసు బలగాలలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో ముస్లింలు 16.6 శాతం ఉన్నారు.

ప్రస్తుతం, పోలీసుల్లో ముస్లింల సంఖ్యపై అధికారిక సర్వేలు, అధ్యయనాలు లేవు.

➢ గతంలో, 2010లో ఒక నివేదిక ప్రకారం 2010 సంవత్సరంలో ఉన్న మొత్తం పోలీసు సిబ్బంది సంఖ్య 15,80,311. వీరిలో మొత్తం ముస్లిం పోలీసుల సంఖ్య 1,09,262 లేదా మొత్తం పోలీసు బలగాల్లో 6.91 శాతం మాత్రమే.

➢ మొత్తం 1,09,262 మంది పోలీసు బలగాలలో 44,457 మంది ముస్లిం పోలీసు సిబ్బంది జమ్మూ మరియు కాశ్మీర్‌లో ఉన్నారు.

➢ జమ్మూ, కాశ్మీర్‌లోని ముస్లిం పోలీసు బలగాలు కాకుండా 64,805 మంది ముస్లిం వ్యక్తులు మాత్రమే పోలీసు ఫోర్స్‌లో భాగంగా ఉన్నారు, ఇది మొత్తం పోలీసు ఫోర్స్‌లో కేవలం 4.31 శాతం మాత్రమే

➢ ఢిల్లీ పోలీసు మొత్తం బలం 75,117. వారిలో కేవలం 1,521 మంది ముస్లిం పోలిస్ అధికారులు.

➢ ఈ గణాంకాలన్నీ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) ద్వారా అందించబడ్డాయి.

➢ సెప్టెంబరు 2012 హెూం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, దేశంలోని మొత్తం 16.6 లక్షల మంది పోలీసు బలగాలలో, ముస్లిం పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు 1.08 లక్షల మంది ఉన్నారు - కేవలం ఆరు శాతం మాత్రమే.

➢ 2012 అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్ డిజిపి ఎసి శర్మను ఉటంకిస్తూ మీడియా నివేదికలో సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి, సిఐఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్ మొత్తం 8.62 లక్షల మందిని కలిగి ఉన్నాయని, అయితే వారిలో 9.9 శాతం మంది మాత్రమే మైనారిటీలకు చెందినవారని చెప్పారు.

➢ జనవరి 2015లో, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, గత 10 సంవత్సరాలలో, పారామిలటరీ బలగాల్లో 10 శాతం కంటే తక్కువ మైనారిటీ ప్రాతినిధ్యం ఉంది. BSF, అస్సాం రైఫిల్స్ మినహా మిగిలిన ఏ బలగాలలో ముస్లిములకు 10 శాతానికి మించి ప్రాతినిధ్యం లేదు.

➢ ఆరు కేంద్ర పోలిస్ బలగాల్లో మైనారిటీ వర్గాలకు చెందిన 85,918 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు.

➢ CRPF, BSF, ITBP, SSB, CISF, అస్సాం రైఫిల్స్‌లో 8.62 లక్షల మంది సిబ్బంది ఉన్నారు, అయితే వారిలో 9.9 శాతం మంది మాత్రమే మైనారిటీలకు చెందినవారు.

➢ పారా దళాలలో మైనారిటీ కమ్యూనిటీ మహిళల సంఖ్య కేవలం 2,240 మాత్రమే.

➢ BSFలో మొత్తం 2.38 లక్షల మంది ఉండగా అందులో అత్యధికంగా 27,916 మంది (11.69 శాతం) మైనారిటీ వర్గాల సిబ్బంది ఉన్నారు. ఇందులో 730 మంది మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు. ఇది అన్ని పారామిలటరీ దళంలోకన్న అత్యధికం.

➢ CRPFలో మొత్తం 2.84 లక్షల మంది ఉండగా అందులో 26,269 మంది ముస్లిములు వారిలో మైనారిటీలకు చెందిన 637 మంది మహిళలు ఉన్నారు.

➢ అస్సాం రైఫిల్స్‌లో అత్యధికంగా 16.16 శాతం మైనారిటీలు ఉండగా, అత్యల్పంగా 6.18 శాతంతో ఐటీబీపీ ఉంది.

➢ 2015 సంవత్సరం సెప్టెంబరులో, హిందుస్థాన్ టైమ్స్ నివేదిక ముంబైలోని 46,000 మంది పోలీసు బలగాలలో దాదాపు 1,200 మంది ముస్లింలు ఉన్నారని వెల్లడించింది.

➢ ఒక శతాబ్దిన్నర క్రితం ముంబై పోలీస్ అధికారికంగా 1864లో ఫ్రాంక్ షౌటర్ మొదటి పోలీసు కమిషనర్‌గా ఏర్పాటు చేయ బడినప్పుడు, అధికారిగా నియమించబడిన ఏకైక భారతీయుడు ఖాన్ బహదూర్ షేక్ ఇబ్రహీం షేక్ ఇమామ్.

➢ ప్రస్తుతం మహారాష్ట్ర పోలీస్‌లో భాగమైన ముంబై పోలీస్‌లో 42,000 మంది కానిస్టేబుళ్లు, 4,300 మంది అధికారులు ఉన్నారు. అందులో ముస్లిం సమాజ ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది: కానిస్టేబులరీలో ముస్లిములు 1,103 మంది సిబ్బంది, కేవలం 100 మంది ముస్లిం అధికారులు ఉన్నారు.

➢ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) 2013 గణాంకాల ప్రకారం, మహారాష్ట్ర పోలీసుల్లో ముస్లింలు కేవలం ఒక శాతం మాత్రమే ఉన్నారు.

➢ ఆంధ్రప్రదేశ్‌లో 10 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 4.8 శాతం, బీహార్‌లో 4.5 శాతం, కర్ణాటకలో 6.4 శాతం, ఢిల్లీలో రెండు శాతం ఉన్నారు.

మే 2018లో, భారతీయ పోలీసు దళంలో ముస్లింల నిష్పత్తి చాలా తక్కువగా ఉందని ఒక అధ్యయనం చూపించింది.

➢ 2011 జనాభా లెక్కల ప్రకారం, ఉత్తరప్రదేశ్ పోలీస్ ఫోర్స్‌లో ముస్లిం పోలీసులు, మహిళల శాతం ఐదు శాతం కంటే తక్కువగా ఉండగా, రాష్ట్రాల వారీగా చూస్తే ఢిల్లీలో 2 శాతం, మహారాష్ట్రకు ఒక శాతం, బీహార్‌లో 4.5 శాతం, రాజస్థాన్‌లో 1.2 శాతం మాత్రమే ముస్లిములు కలరు.

➢ IPSలో ముస్లింలు పూర్తిగా తక్కువ ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. 1950లలో ముస్లింల వాటా ఐదు శాతం కంటే తక్కువగా ఉంది. IPSలో ముస్లింల నిష్పత్తి 2016లో మూడు శాతానికి పడిపోయింది

➢ భారతదేశంలోని పోలీసు శాఖలో ముస్లింలు దాదాపు ఆరు శాతం ఉన్నారు.

నవంబర్ 2019లో, భారతీయ పోలీసుల్లో ముస్లిం ప్రాతినిధ్యం మూడు నుండి నాలుగు శాతం వరకు ఉందని ఒక అధ్యయనం వెల్లడించింది.

సెప్టెంబరు 2022లో, రాజస్థాన్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో పోలీసు శాఖలలో ముస్లిం ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని RTI వెల్లడించింది.

## రాష్ట్ర పోలీస్ సర్వీసెస్

భారత దేశంలోని వివిధ రాష్ట్రాలలో మొత్తం 8434 మంది రాష్ట్ర పోలీస్ అధికారులు ఉండగా అందులో ముస్లిముల సంఖ్య387

## రాష్ట్ర డి.జీ.పి.లు

భారత దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఇంతవరకు ఉన్న డి.జీ.పిల మొత్తం సంఖ్య 999 కాగా అందులో ముస్లిములు 27 మంది.

## పోలీస్ అమర వీరులు

రాష్ట్ర పోలీస్ సర్వీసులో మొత్తం అమర వీరులు 5128 కాగా అందులో ముస్లిములు 210.

## పోలీస్ అకాడమి చీఫ్‌లు

దేశంలోని అన్ని రకాల (కేంద్ర/రాష్ట్రాల) పోలీస్ అకాడమి ఛీఫ్స్ Police Academy Chiefలు 294కాగా అందులో ముస్లిములు 7 మంది మాత్రమే.

## పోలీస్ హౌసింగ్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్స్

పోలీస్ హౌసింగ్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్స్ DGs/MDs/ Police Housing and Welfare Corporations, DGs/MDs మొత్తం 380 మంది కాగా అందులో ముస్లిములు 13 మంది మాత్రమే.

మొత్తంమీద, చట్టాన్ని అమలు చేసే సంస్థలలో ముస్లింల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది.

**మూలం: క్లారియన్ ఇండియా,**


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

32 – 33 వారి స్థితి తెలిసీ వారికి ప్రపంచంలోని ఇతర జాతులపైన ప్రాధాన్యత నిచ్చాము, వారికి చూపించిన నిదర్శనాలలో విస్పష్టమయిన పరీక్షా ఉండింది.[29]

34 – 42 వీరంటారు, "మా తొలి చావు తప్ప మరేమీ లేదు, దాని తరువాత తిరిగి మేము లేపబడేది లేదు.[30] నీవు చెప్పేదే నిజమయినట్లయితే మా తండ్రీ తాతల్ని లేపి తీసుకు రా."[31] వీరు మేలయినవారా లేదా "తుబ్బ'" జాతి[32] ప్రజలు ఇంకా వారికి పూర్వపు జనులా? మేము వారిని నాశనం చెయ్యడానికి కారణం వారు అపరాధులయి పోవడమే.[33] ఈ భూమీ ఆకాశాలూ వీటి మధ్యనున్నవన్నీ మేము ఏదో క్రీడా విశేషంగా సృజించలేదు.

29. వివరణకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం సం.1, అల్ బకర: పాదసూచికలు 64–85 సం.2, అన్ నిసా: పాద సూచికలు 182 – 199 అల్ మాఇద: పాద సూచికలు 42 – 47 సం.3, అల్ ఆరాఫ్ : పాద సూచికలు 97 – 132 సం.4, తాహా: పాద సూచికలు 56 – 74.

30. అంటే, మొదటిసారే మేము మరణించినప్పుడు సర్వనాశన మయిపోతాము. ఆ తరువాత మరే జీవితమంటూ ఉండదు. "తొలిచావు" అనే పదాల వల్ల ఆ తరువాత మలిచావు కూడా ఉంటుందన్న విషయం తప్పనిసరి కాదు. మనం ఫలానా వ్యక్తికి తొలి పిల్లవాడు పుట్టాడు అని అంటాము. ఆ మాట ధ్రువపడటానికి ఆ తరువాత తప్పనిసరిగా రెండవ పిల్లవాడు పుట్టటం అవసరం లేదు, దానికి ముందు ఏ పిల్లవాడూ పుట్టకపోవడం మాత్రమే సరిపోతుంది.

31. వారి వాదన ఏమిటంటే, మేము ఎన్నడూ మరణానంతరం ఎవరినీ మళ్ళీ బ్రతికి బట్టకట్టగా చూడలేదు. అందువల్ల మేము దృఢంగా నమ్ముతున్నాము, మరణానంతరం మరో జీవితమంటూ ఏదీ లేదు. మీరు మరో జీవితముంటుందని వాదించే మాటయితే మా పూర్వీకుల్ని గోరీల నుండి లేపుకుని తీసుకురండి, మాకు మరణానంతర జీవితం గురించి గట్టి నమ్మకం కుదురుతుంది. మీరీ పని గనక చేయకపోతే మీ వాదన నిరాధారమయిందని మేము భావించవలసి ఉంటుంది. అంటే ఇది వారి దృష్టిలో మరణానంతర జీవితం ఖండనకు మహా గట్టివాదన, ఆధారం. వాస్తవానికి ఇది ఎంతమాత్రం పసలేనిది. మరణించేవారు తిరిగి బ్రతికి ఇదే ప్రపంచంలోకి వస్తారని వీరికి ఎవరు చెప్పారు? ప్రవక్త (స) అయినా లేదా మరే ముస్లిమ్ వ్యక్తి అయినా మేము మృతులను బ్రతికిస్తామని ఎప్పుడన్నారనీ?

32. "తుబ్బ'" అన్నది 'హిమీయర్' రాజుల బిరుదు. ఉదాహరణకు, కిస్రా, కైసర్, ఫిర్ఔన్ మొదలయిన బిరుదులు విభిన్న దేశాల రాజులకు ప్రత్యేకమయినట్లే ఇదీను. వీరు 'సబా' జాతిలోని ఒక శాఖకు చెందినవారు. క్రీ.పూ. 115లో వీరికి సబా దేశం పైన ఆధిక్యత ప్రాప్తమయింది. క్రీ.శ. 300 వరకు వీరు పరిపాలకులుగా అలరారారు. అరేబియాలో శతాబ్దుల తరబడి వీరి ఘనకీర్తి కథలు జనసామాన్యం నోట ప్రచారం పొందేవి. (వివరణకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.6, సబా : పాద సూచి 37).

33. ఇది తిరస్కారుల అభ్యంతరానికి మొదటి సమాధానం. ఈ సమాధానం క్లుప్తంగా ఏమిటంటే, పరలోక తిరస్కారం ఒక వ్యక్తి నయినా, ఒక జాతినయినా అపరాధిగా మార్చనిదే వదలిపెట్టదు. దీని తప్పనిసరి పరిణామం నైతికతా దౌష్ట్యం. జీవితపు ఈ సిద్ధాం తాన్ని అవలంబించిన ఏ జాతి అయినా అది చివరకు సర్వనాశన మయిందన్నది ప్రపంచ చరిత్ర పలికే సాక్ష్యం. పోతే, "వీరు మేలయినవారా లేదా "తుబ్బ' " జాతి ప్రజలు, ఇంకా వారికి పూర్వపు జనులా?" అన్న ప్రశ్న మాటకు వస్తే, దీని భావం, ఈ మక్కా తిరస్కారులయితే తుబ్బ జాతి, దానికి పూర్వం సబా, ఫిర్ఔన్ జాతి, ఇతర జాతులకు ప్రాప్తమయిన ఆ సుసంపన్నత, ఆ ప్రాభవ వైభవాలకు ఎన్నటికీ చేరుకోలేరు. కాని ఆ భౌతిక సుసంపన్నత, ప్రాపంచిక వైభవ ప్రాభవాలు, నైతిక పతనపు పరిణామాల నుండి వారిని ఎప్పుడు కాపాడగలిగిందనీ – వీరు తమ ఈ కొద్దిపాటి సంపద, తమ సాధనా సంపత్తుల మూలంగా వాటిని తప్పించుకోగలగటానికి? *(మరిన్ని వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.6, సబా: పాదసూచికలు 25, 36)*

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

### తహసీల్దారు హితవు

**125)** అబూ సయీద్ ఖుద్రీ(రజి), అబూ హురైరా(రజి)లిరువురూ ఇలా తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక సహచరుణ్ణి (సవాద్ బిన్ గజియా– రజిను) ఖైబర్‌పై అధికారిగా నియమించి పంపారు. ఆయన అక్కడి నుండి నాణ్యమైన ఖర్జూరాలను తెచ్చారు. "ఖైబర్‌లోని ఖర్జూర పండ్లన్నీ ఇలాగే ఉంటాయా?" అని దైవప్రవక్త(స) దర్యాప్తు చేయగా, 'లేదు, దైవసాక్షిగా ఓ దైవ ప్రవక్తా! అక్కడి ఖర్జూరాలన్నీ ఇలా ఉండవు. నేను రెండు లేక మూడు 'సా'ల నాసిరకం ఖర్జూరాలను ఇచ్చి వాటికి బదులుగా ఒక 'సా' నాణ్యమైన ఖర్జూరాలను తీసుకుంటూ ఉంటాన'ని ఆ సహాబీ విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త(స) "అలా చేయకండి. నాణ్యమైన ఖర్జూరాలు తీసుకోవాలనే అనుకుంటే మీ దగ్గరున్న ఖర్జూరాలన్నింటినీ దిర్హములకు బదులుగా అమ్మేయండి. అలా వచ్చిన దిర్హములతో నాణ్యమైన ఖర్జూరాలను కొనుగోలు చేయండి" అని బోధించారు.

అబూ హురైరా (రజి) గారి మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) అన్సార్ కుటుంబీకులకు చెందిన బనీ అదీ సోదరుణ్ని ఖైబర్ అధికారిగా నియమించి పంపారు.

అధ్యాయం : 43

### జైద్ బిన్ హారిసా(రజి) యుద్ధం గురించి[1]

**128)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉసామా బిన్ జైద్(రజి)ను ఒక సైనిక దళానికి అధిపతిగా నియమిం చారు. ఈ నియామకంపై కొంతమంది అభ్యంతరం తెలిపారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా అన్నారు: "ఈ రోజు ఈ అబ్బాయి నియా మకంపై మీకు అభ్యంతరం ఉంటే, కొన్నాళ్ళ క్రితం ఇతని తండ్రి (జైద్ బిన్ హారిసా) సారథ్యం పట్ల కూడా మీకు ఇలాంటి అభ్యంతరమే ఉండేది. అవునా! దైవసాక్షిగా! అతను సైనిక సారథ్యానికి అన్ని విధాలా తగినవాడు. అదీగాక అతను, ఈ అబ్బాయి ఉసామా బిన్ జైద్ మాదిరిగానే నాకు ఎంతో ప్రియతముడు."[1]

128-1. అప్పట్లో ఈ విధంగా అర్థం లేని అభ్యంతరాలు లేవనెత్తే వారి నాయకుడు అయాష్ బిన్ అబీ రబీయా. దైవప్రవక్త(స) ఒక కుర్రవాణ్ణి ముహాజిర్లకు నాయకునిగా చేయటం విడ్డూరం అని వ్యాఖ్యానించాడు. మరి కొంతమంది కూడా అతని అభ్యం తరాన్ని సమర్థించారు. ఈ సమాచారం హజ్రత్ ఉమర్(రజి)కు తెలిసింది. ఆయన వారికి సర్దిచెప్పి, విషయాన్ని దైవప్రవక్త(స)కు చేరవేశారు. ఈ ధోరణిపై దైవప్రవక్త(స) కినుక వహించి, ప్రసం గించారు. ఉసామా(రజి) సారథ్యంలో సైనిక దళాన్ని పంపమని ఆయన(స) తన మరణానికి ముందు కూడా గట్టిగా తాకీదు చేశారు. ఆ సైనిక దళం మదీనా పొలిమేరల్లో ఉండగానే మహా ప్రవక్త (స) పరమపదించారు. ప్రథమ ఖలీఫా(రజి) హజ్రత్ అబూబక్ర్ పదవీ బాధ్యతలు చేపట్టగానే ఉసామా సారథ్యంలో ఆ సైనిక దళాన్ని యుద్ధానికి పంపించారు.

★★★

# ఆచరణకు ప్రాణం విశ్వాసం

- ఎస్.ఎమ్. మలిక్

**గత సంచిక తరువాయి...**

### ఏది సదాచరణ?

సదాచరణ సందర్భంగా గుర్తుంచుకోవలసిన రెండవ ముఖ్యమయిన విషయం:

జనుల్లో సదాచరణగా చెలామణిలో ఉన్న ప్రతి ఆచరణ నిజమయిన సదాచరణ కాదు. ఏ ఆచరణను దైవం ఆచరించే ఆదేశం ఇచ్చాడో ఆ ఆచరణను దైవప్రవక్త (స) ఏ విధంగా ఆచరించి చూపారో ఆ విధానం అనుసరణలో చేసినదే నిజమయిన సదాచరణ!

ఇదే విషయాన్ని దైవ ప్రవక్త (స) మరో విధంగా వివరించారు:

"ఆచరణలకు ఆధారం సంకల్ప శుద్ధి. ప్రతి ఒక్కరూ దేన్ని సంకల్పించుకుంటారో దాన్నే పొందుతారు".

సంకల్పశుద్ధి అన్నది మానసిక స్థితి. ఈ మానసిక స్థితి పైనే విశ్వాసమూ ఆధారపడి ఉంది.

అంటే విశ్వాసం విశుద్ధమయినప్పుడే ఆచరణలు ఫలవంతం అవుతాయన్న ఆశ ఏర్పడుతుంది. ఈ విషయంలో మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ అనేక పండితుల అభిప్రాయాలను ఉటంకించారు:

విశ్వాసం విశుద్ధమవడం అంటే ఆచరణల ఉద్దేశం కేవలం దైవ ప్రసన్నత మాత్రమే కావడం. మానవుల మెప్పునకు అతీతంగా ఆచరణ జరగాలి. ఆచరణల బాహ్య స్వరూపం కూడా వాటి అంతరంగ స్వరూపంలానే ఉండాలి. అంటే బాహ్యం అంతరంగాన్ని ప్రతిబింబించాలి. ఆచరణ సందర్భంలో దైవం వైపునకు శ్రద్ధ కలిగి, ఆయన తలంపు సృష్టితాలన్నింటికీ అతీతమయి ఉండాలి. ఒక ఆచరణ దైవ సన్నిధిలో స్వీకృతి పొందడానికి అది విశుద్ధమయి, నిష్కపటమయి, సవ్యమయి ఉండాలి.

స్వీకృతి అంటే ఫలవంతమవడం. విశుద్ధమూ నిష్కపటమూ అంటే కేవలం దైవ ప్రసన్నత కొరకు మాత్రమే చేయాలి, మరెవరి మెప్పు కూడా అందులో చేరరాదు. సవ్యమయినదంటే అది దైవ ప్రవక్త (స) సంప్రదాయాన్ని అనుసరించి ఉండాలి.

ఏ ఆచరణ విశుద్ధంగా కేవలం దైవ ప్రసన్నత కొరకు మాత్రమే చేయబడలేదో, అంటే అందులో సృష్టిలో ఎవరి పట్ల అయినా ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా అటువంటి వ్యక్తికి పరలోకంలో "ఇటు నుంచి దూరంగా వెళ్లు, నీవు ఎవరి కొరకు ఆ ఆచరణ చేశావో వారి ద్వారానే దానికి ప్రతిఫలం పొందు, మా వద్ద నీ ప్రతిఫలం లేదు" అనడం జరుగుతుంది!

### ఈమాన్ - ఇస్లామ్

ఈమాన్ (విశ్వాసం) అన్నది ఆంతర్య స్థితి అయితే ఆచరణలో దాని వ్యక్తీకరణే ఇస్లామ్.

ఆచరణల్లో విశుద్ధ, దైవ ప్రసన్నతలనే 'ఇస్లామ్ సారం' (Essence) అని అంటారు.

ఈ విషయాన్ని బలపరుస్తుంది ఈ ఆయత్:

"ఓ ప్రవక్తా! చెప్పు, నా నమాజ్, నా ఉపాసనలన్నీ, నా జీవితం, నా మృత్యువు, సర్వం సకల లోకాల ప్రభువయిన అల్లాహ్ కొరకే అంకితం." (అల్ అన్ఆమ్. 6: 162)

## ఇవి రెండూ ఒకే స్థితిలో ఉండవు

ప్రవక్తశ్రీ (స) సహచర మాన్యులలో, వారి అనుచరులలో ఎన్నో సంఘటనలు జరిగాయి. వాటి ద్వారా ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒకటి, 'విశ్వాస స్థితి తరుగుతూ పెరుగుతూ వుంటుంది, ఆ తరుగుదల అయినా పెరుగుదల అయినా ఆచరణతో ముడిపడి ఉంటాయి' అన్నది.

ఒక ఉల్లేఖనం ప్రకారం ఇద్దరు వ్యక్తులు దైవ సందేశహరుల వద్దకు తమ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు వచ్చారు. వివాదం వారసత్వానికి సంబంధించినది. ఇద్దరూ మీరాశి పట్ల దావా వేశారు కాని ఎవరి వద్ద కూడా తమ వాదనకు ఆధారం, సాక్ష్యం లేదు. ఇద్దరూ అహంభావంతోనే వాదిస్తున్నారు. దానికి దైవప్రవక్త(స), "నేను సాధారణ మానవుణ్ణి, మీలో ఒకరు బాగా మాటకారి కావచ్చు, నేను అతని మాటలకు ప్రభావితుణ్ణయి అతని పక్షాన తీర్పు చెయ్యడం సాధ్యం. అయితే ఎవరి హక్కు నుండి ఓ భాగం ఇతరునికి అప్పజెప్పడం జరుగుతుందో అది అతని కొరకు అగ్ని కణంగా రూపొందుతుంది జాగ్రత్త!" అన్నారు.

అంతే, ఈ హెచ్చరిక వినగానే ఇద్దరిలోనూ దైవ భీతితోపాటు విశ్వాసం జాగృతమయింది. పరలోక భయం చేత ఉభయులూ రోదించ సాగారు. ప్రతి ఒక్కరూ మరొకరి కొరకు తమ హక్కును వదులు కునేందుకు సిద్ధమయ్యారు. అప్పుడు దైవ సందేశహరులు(స) సరిసమానంగా పంచుకోవాలని, ఏదో కారణంగా ఒకరికి అధికంగా లభించినా మరొకరు చూపోపు వహించాలని ఉపదేశించారు.

ఇది విశ్వాస అభివ్యక్తికి సంబంధించిన ఓ సాధారణ నమూనా. ఆ అభివ్యక్తి మనోమస్తిష్కాలను కాస్త స్పర్శించగానే ఈమాన్ జాగృతమయింది. పూర్వం అణగిపోయిన విశ్వాస స్థితి, ఇప్పుడు వృద్ధి చెందింది!

## ప్రత్యేకత

విశ్వాసుల ఈ ప్రత్యేకతను దివ్య కుర్ఆన్ ఈ విధంగా ప్రస్తావించింది:

"నిజమయిన విశ్వాసులయితే, వారి అంతర్యాలు అల్లాహ్ ప్రస్తావన రాగానే చలించి వణికిపోతాయి. వారి సమక్షంలో దైవ వచనాలు పఠించినప్పుడు వారి విశ్వాసం వృద్ధి చెందుతుంది. ఇంకా వారు తమ ప్రభువు పైన భరోసా కలిగి ఉంటారు." (అల్ అన్ఫాల్. 8: 2)

"మరి ఎవరయితే విశ్వసించారో వారి విశ్వాసంలో వాస్తవానికి (అవతరించే ప్రతి సూరా) వృద్ధినే కల్పించింది. వారు దీని వల్ల సంతుష్టితోనే ఉన్నారు." (అత్ తౌబా 9 : 124)

మౌలానా మౌదూదీ (అ) ఈ సందర్భంగా ఇలా అన్నారు:

"మనిషి సమక్షంలో దైవాదేశాలు రాగా అతను వాటిని ధ్రువీకరించడంతోపాటు వాటిని పాటించడం మొదలెడితే అతని విశ్వాసంలో వృద్ధి జరుగుతుంది. అతను తన మనోకాంక్షలకు, తన అభిమానాలు, సౌఖ్యాలకు వ్యతిరేకంగా, హృదయాన్ని మలచి దైవం, దైవ ప్రవక్త(స) విధేయతను పాటించినట్లయితే అతని విశ్వాసంలో విస్తృతి జరుగుతుంది. మరి పరిస్థితి దీనికి భిన్నమయితే అతను కాపట్య రోగానికి, తిరస్కార అభిశాపానికి గురవుతాడు."

అంటే విశ్వాసం, తిరస్కారం - విశ్వాసం, కాపట్యం, రెంటి స్థితిలోనూ పెరగటమూ, తరగటమూ జరుగుతాయి!

## విధేయత - విశ్వాసం

మనిషి ఎంతగా విధేయతలో ముమ్మందుకు సాగుతాడో అంతగానే విశ్వాస స్థితి కూడా పెరుగుతుంది, మరి ఎంతగా అతను దైవ విధేయతకు దూరంగా జారుకుంటూ ఉంటాడో అంతగానే ఈ స్థితి తరుగుతూ ఉంటుంది.

విశ్వాసి జీవితంలో అడుగడుగునా ఇటువంటి దశలు ముందుకు వస్తుంటాయి, అతను పరీక్షలకు గురి కావలసి వస్తుంది, అతను ఇటువంటి పరీక్షల్లో నికార్సుగా తేలినప్పుడు అతని విశ్వాసంలో పెరుగుదల సంభవిస్తుంది. ఒక వేళ అతను ఇటువంటి సందర్భాల్లో జారిపడినట్లయితే అతని విశ్వాసం కూడా ప్రమాదాలకు గురవుతుంది.

అంటే మన విశ్వాసం సదా అవిచ్ఛిన్న మయినది (Taken for granted for ever) కాదు! మనం దాన్ని కాపాడుకుంటూ ఉండవలసి ఉంటుంది!!

నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

# కాలంతో పోటీ పడదాం!

- మదీహా




**మానవ జీవితం చాలా అమూల్యమైనది.** అది ఎప్పుడు, ఎక్కడ, ఎలా ముగిసితుందో ఎవరికీ తెలియదు. అదొక దైవ రహస్యం. దాన్ని ఛేదించే శక్తి దైవం ఎవ్వరికీ ప్రసాదించలేదు. జీవితకాలాన్ని సద్వినియోగం చేసుకోవడం పైన్నే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రపంచంలో మనం ఏదైనా సాధించవచ్చు.. ఛేదించ వచ్చు. డబ్బు.., గౌరవం.., ఉద్యోగం.., అధికారం.., హెూదా.. ఏదైనా కావచ్చు, అదిసాధ్యమే.. కాని కాలాన్నిమాత్రం ఎంత ధనం ధారపోసినా, ఎంతపలుకుబడి ఉపయోగించినా సాధించలేము. గడిచిన కాలం- అది రెప్ప పాటైనా సరే- కోట్లు కుమ్మరించినా మనకు లభించదు. ఇది కాలం చెప్పే సత్యం. మనం దాని విలువను గుర్తించకపోతే అది మనకోసం ఆగదు. సమయాన్ని సమర్ధవంతంగా సద్వినియోగం చేసుకోగలిగినప్పుడే అదిమనకు ఉపకరిస్తుంది. లేకపోతే అది మనల్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి ముందుకు సాగిపోతుంది. అందుకని మనం ఏ విషయంలో అయినా సకాలంలో స్పందించగలగాలి. సమయం మించిపోయిన తరువాత తీరిగ్గా విచారిస్తే ప్రయోజనం ఉండదు. అవకాశాలు ఎప్పుడూ మనకోసం నిరీక్షిస్తూ ఉండవు. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. మనమే వాటిని అందిపుచ్చుకోవాలి. అవి మన వద్దకు రావాలని ఆశించడం సరికాదు. ఎప్పుడు ఏది అవసరమో దానిపై దృష్టి కేంద్రీకరించాలి. బాధ్యతల నిర్వహణలో అలసత్వాన్ని దరి చేరనీయకూడదు. ఎందుకంటే, ఈరోజు చేయవలసిన కార్యాన్ని రేపటికి వాయిదా వేశామంటే కాలానికి మనం విలువ ఇవ్వనట్లే లెక్క. ఈనాటి కొద్దిపాటి అలక్ష్యం రేపటి బాధ్యతను రెట్టింపు చేస్తుంది. ఒకటికి రెండు తోడై, బాధ్యతలు పేరుకు పోతాయి. ఇక ఆతరువాత బాధ్యతల నిర్వహణ తలకు మించిన భారంగా మారి, పలాయనవాదాన్ని ఆశ్రయించే దుస్థితి వస్తుంది. అద్భుతమైన విజయాలను సాధించినవారి జీవితాలను పరిశీలిస్తే, వారు కాలాన్ని (సమయాన్ని) ఎలా తమకు అనుకూలంగా మలచుకొని, సద్వినియోగం చేసుకొని, కొత్త అవకాశాలను సృష్టించుకున్నారో, కొంగ్రొత్త ఆవిష్కరణలకు ఎలా నాంది పలికారో మనకు అర్ధమవుతుంది. ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ తన జీవితకాలంలో వెయ్యికంటే ఎక్కువ నూతన ఆవిష్కరణలకు నాంది పలికాడు. వాటిలో గ్రామ్ ఫోన్, విద్యుత్తు బల్బు అతని ఆవిష్కరణలే. ఇది ఎలాసాధ్యమైంది? అతను కాలం నాడిని ఒడిసిపట్టి, దాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. కాలక్షేపం కోసం కాలాన్ని దుర్వినియోగం చేయలేదు. సరదాలు, షికార్లు, సొల్లు కబుర్ల కోసం సమయాన్ని నిర్లక్ష్యం చేయలేదు. నేటి యువతకు లాగా (అందరూ కాదు సుమా) స్మార్ట్ ఫోనుకే అతుక్కుపోయి, ఫేస్ బుక్కు, వాట్సాపు చాటింగుల్లో సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లుగా, ఆనాడతను సమయాన్ని దుర్వినియోగం

చెయ్యలేదు. తన ప్రయోగశాలనే వినోదశాలగా మార్చుకున్నాడు. చేస్తున్న పనిలోనే ఆనందాన్ని, వినోదాన్ని అనుభవించాడు. కాలం విలువను గుర్తించబట్టే, విద్యుత్ బల్బును కనుగొనే సమయంలో ఏకధాటిగా పన్నెండు, పదమూడు రోజులు ప్రయోగశాలలోనే నిద్రలేని రాత్రులు గడిపాడు. అనుకున్నది సాధించాడు. అందుకని కాలం విలువను గుర్తించాలి. దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకొని విజయ తీరాలకు చేరినవారి గాథల్ని అధ్యయనం చెయ్యాలి. స్ఫూర్తిపొందాలి. అపజయాలు మూటగట్టుకొని కాలగతిలో కలిసిపోయిన వారి గాథల్ని గుణపాఠాలుగా తీసుకోవాలి. కాలం / సమయం మనకు అనేక నిజాలు చెబుతోంది. బుద్ధిజీవి అయిన మానవుడు వాటిని అవలోకన చేసుకుంటూ, నీతిగా, నిజాయితీగా, విలువలతో కూడిన జీవితం గడుపుతూ, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఎన్ని అవాంతరాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు. గమ్యాన్ని ముద్దాడవచ్చు. దేవుడు మనందరికీ ఈకొత్త సంవత్సరంలో సకల శుభాలూ, సంతోషాలు కలుగ జేయాలని, గతం నుండి గుణ పాఠాలు నేర్చుకుంటూ వెలుగులవైపు నడిపించాలని కోరుకుందాం.!

# మస్జిదుల్లో మొహల్లా ట్యూషన్ సెంటర్లు




- అస్గర్ అలీ

ఇప్పుడు చిన్నారులు ట్యూషన్ కోసం స్కూలు బ్యాగులను తగిలించుకుని మస్జిదులకు వెళుతున్నారు. నమాజు ముగిసిన తర్వాత, పిల్లలు మస్జిదు ఆవరణలో ఉన్న గదుల్లో గణితం, ఇంగ్లీష్, తెలుగు నేర్చుకుంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 50 మస్జిదుల్లో 2500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని 'రేడియన్స్' పత్రిక ప్రచురించింది. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలు లేదా తక్కువ ఖర్చుతో కూడిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులున్నారు. స్కూలు ఫీజులు చెల్లించి ఆ పై ట్యూషన్లు చెప్పించడమంటే తలకు మించిన భారమే. ఇలాంటి విద్యార్థులకు మస్జిదు కమిటీలు ఉచిత ట్యూషన్ సెంటర్లు నిర్వహించడం నిజంగా అభినందనీయం. తల్లిదండ్రులు, బోధకుల కోసం ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌లు సృష్టించబడతాయి. విద్యార్థుల పనితీరుకు సంబంధించిన సమాచారాన్ని తల్లిదండ్రులతో పంచుకుంటారు. రెగ్యులర్ హాజరుకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. బోధకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, మసీదు కమిటీల మధ్య సన్నిహిత సంబంధాలు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. విద్యార్థుల్లో కోర్ సబ్జెక్టులపై అవగాహన పెరిగింది.

హైదరాబాద్ పాతబస్తీలోని అక్బర్‌నగర్ ప్రాంతంలో పలు మస్జిదుల్లో పార్ట్‌టైమ్ పాఠశాలలు లేదా మక్తబ్‌లు నడుస్తున్నాయి. గణితం, సైన్స్, ఇంగ్లీష్, తెలుగు వంటి సబ్జెక్టులను బోధిస్తున్నారని 'ద హిందూ' పత్రిక కథనాన్ని ప్రచురించింది. టెక్కీల బృందం ప్రారంభించిన ఈ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ, బడ్జెట్ పాఠశాలల నుండి పిల్లలకు ఉచిత విద్యను అందిస్తుంది.

అసర్ (సాయంత్రం) సామూహిక ప్రార్థనలను ముగించిన తర్వాత తరగతులు ప్రారంభమవుతాయి. హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న TQF, అట్టడుగు, వెనుకబడిన వర్గాల విద్యా, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పురోగతిని పెంపొందించడానికి కట్టుబడి ఉన్న ఒక నమోదిత లాభాపేక్షలేని సంస్థ.

TQF ఇతర NGOల సహకారంతో పనిచేస్తుంది. విద్యాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక అభివృద్ధి, ఆరోగ్యం, శ్రేయస్సు కోసం TQF పని చేసే ప్రధాన రంగాలు.




- యండి. ఉస్మాన్ ఖాన్

## నూతన సంవత్సరం...

# ఆత్మ పరిశీలనా సందర్భం

**ఆనందం, సంతోషం -** ఇవి మానవ స్వభావంలో ఉన్న సహజ గుణాలు. సంతోష సమయాల్లో మంచి వస్త్రాలు ధరించడం, రుచికరమైన వంటలు ఆరగించడం, నిషిద్ధాలకు దూరంగా ఇతర పద్ధతుల్లో కూడా ఆనందానుభూతుల్ని వ్యక్తం చేయడం తప్పు కాదు. ప్రపంచంలో చలామణిలో ఉన్న మతధర్మాలన్నీ దాదాపుగా మానవుల సహజ అవసరాలను గుర్తించి, కొన్ని సక్రమమైన పద్ధతుల్లో వాటిని తీర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నాయి.

కృత్రిమత్వాన్ని అవలంబించి, లేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకొని ఆనందానికి దూరంగా ఉండమని ధర్మం చెప్పదు. అలా అని ఆనంద సమయాల్లో హద్దుల్ని అతిక్రమించి, అధర్మ, అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడడాన్నీ అది సమ్మతించదు. ఎందుకంటే ధర్మంలో ప్రతిదానికీ ఒక హద్దూ, ఒక పరిధి నిర్ణయమై ఉన్నాయి. సమయ సందర్భాలు ఏవైనప్పటికీ వాటిని అతిక్రమించడానికి మాత్రం వీల్లేదు.

ఉదాహరణకు, పండుగ ఒక సంతోష సమయం. ఆనందంలో తేలియాడుతూ సంబరం చేసుకునే సందర్భం. అయితే ఈ సంతోష సమయాన తాగి తందనాలాడడం, జూదంలో మునిగి తేలడం సమ్మతంకాదు. ధర్మం దీన్ని అంగీకరించదు. ధార్మికంగానే కాకుండా నైతికంగా, సామాజికంగా కూడా ఇలాంటి చేష్టలు నేరం. దేవుని చట్టమే కాదు, ప్రపంచంలోని మానవ చట్టాలు కూడా దీన్ని హర్షించవు. అందుకని ధార్మిక, మానవీయ పరిధుల్ని అతిక్రమించకుండా ధర్మసమ్మతమైన మార్గాల్లో సంబరాలు జరుపుకోవడం సమ్మతమే. ఇస్లాం ధర్మం ఎప్పుడూ మానవుల్ని సంతోషంగా, నూతనోత్సాహంతో, ప్రఫుల్ల భావాలతో, హుషారుగా ఉంచాలని అభిలషిస్తుంది. అందుకే అది ఒక పరిధిమేర మానవులకు స్వేచ్ఛను, స్వయం నిర్ణయాధికారాన్ని ప్రసాదించింది.

ఇదే విధంగా నూతన సంవత్సర వేడుక. ఇదొక నిరంతర ప్రక్రియ. కాలప్రవాహంలో కొత్త సంవత్సరాలు వస్తుంటాయి. పోతుంటాయి.

కేలండర్లూ మారుతూ ఉంటాయి. అమూల్యమైన కాలం ఎవరి కోసమూ ఆగదు. దానివెంట పరుగెత్తలేని వారు మరుగున పడిపోతారు. సృష్టి ఆరంభం నుండి నేటి వరకు అందరూ కాలగర్భంలో కలిసిపోయినవారే, కలిసిపోయేవారే. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేటప్పుడు ఈ యదార్థాన్ని గుర్తుంచుకోవాలి.

యుగ యుగాల ఈ కాల పరంపరలో మానవ జీవితకాలం చాలా చిన్నది. దీన్ని సద్వినియోగం చేసుకోవడంలోనే మానవ ఔన్నత్యం దాగి ఉంది. ఎందుకంటే సృష్టిలో ఉన్నటువంటి అసంఖ్యాక జీవరాసుల్లో ఏ ఒక్కదానికీ మానవుడికున్నన్ని తెలివితేటలు లేవు. బుద్ధికుశలత, విచక్షణా జ్ఞానం మనిషికి మాత్రమే సొంతం. అంతటి అద్వితీయ విజ్ఞాన సంపన్నుడు, సృష్టికే మకుటాయమానంగా వెలుగొందుతున్న విచక్షణా జ్ఞాన ఖని తన స్థాయిని కోల్పోయి కాల ప్రవాహంలో కొట్టుకుపోకూడదు.

నిస్సందేహంగా కొత్త సంవత్సరానికి సంతోషంగా స్వాగతం పలకవలసిందే. కాని ఆ సంతోషంలో హద్దుల అతిక్రమణ జరగకూడదు. అవాంఛనీయ కార్యకలాపాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించడం ఎంతవరకు సబబు అని ఆలోచించాలి. నిజానికి గత సంవత్సరం ఏమేమి చేశాము అని ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సందర్భమిది. మంచి పనులు చేసిఉంటే, సత్కార్యాలు ఆచరించి ఉంటే ఈసారి అవి ఇంకా అధికంగా, ఇబ్బడి ముబ్బడిగా చేయాలన్న దృఢసంకల్పం చెప్పుకోవాలి. ఒకవేళ ఏమైనా తప్పులు, పాపాలు జరిగి ఉంటే సిగ్గుతో పశ్చాత్తాప పడుతూ, ఇకముందు ఎట్టి పరిస్థితిలోనూ అలాంటి వాటి జోలికి పోమని ప్రతిజ్ఞ చేయాలి.

అందుకని ప్రతి ఒక్కరూ ఈ నూతన సంవత్సర ప్రారంభ వేళ, మందు, చిందు లాంటి అవాంఛనీయ, అసభ్య కార్యకలాపాలకు తావీయకుండా నైతిక విలువలను పాటిస్తూ మానవ ఔన్నత్యానికి భంగం కలగని విధంగా కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించాలి. ఈ నూతన సంవత్సరాన సృష్టికర్త అయిన దైవం సమస్త మానవాళికీ మంచి బుద్ధినీ, సమృద్ధిగా శుభాలను ప్రసాదించాలని మనసారా కోరుకుందాం. ముఖ్యంగా మన యువతరాన్ని అన్ని రకాల దుర్వ్యసనాల నుండి కాపాడాలని ప్రార్థిద్దాం.

## అన్నిటికంటే గొప్పది



“దేవుడు భువిని సృష్టించగానే అది కంపిచడం ప్రారంభించింది. అప్పుడు దేవుడు పర్వతాలను సృజించాడు. వెంటనే భూమి కంపించడం ఆగిపోయింది. ఇది చూసిన దైవదూతలు ఆశ్చర్యచకితులై దైవాన్ని ఇలా ప్రశ్నించారు. ఓ ప్రభూ! మీ సృష్టితాల్లో పర్వతాలకంటే కూడా బలమైనవి ఇంకేమైనా ఉన్నాయా? అప్పుడు దైవం ఇంతకంటే బలమైనది ఇనుము అని బదులిచ్చాడు. మా ప్రభూ! మీరు సృజించిన వాటిలో ఇనుము కంటే కూడా శక్తిమంతమైనది ఇంకేమైనా ఉందా? అని ప్రశ్నించారు దైవదూతలు. ఆఁ... ఉంది అదే ‘అగ్ని’ అని పలికాడు దైవం. మళ్లీ దైవదూతలు ‘ఓ మా ప్రభూ! మీ సృష్టిలో అగ్నికంటే కూడా బలమైనది ఇంకేమైనా ఉందా? అని అడిగారు. దానికి దైవం ‘నీరు’ అని బదులు పలికాడు.

ఓ దేవా! మీ సృష్టితాల్లో నీటికంటే కూడా శక్తిమంతమైన వస్తువింకేమైనా ఉందా? అని మళ్లీ ప్రశ్నించారు దైవదూతలు. ఆఁ... ఉంది. అదే ‘గాలి’ అన్నాడు దైవం. ‘ఓ మా ప్రభూ! మీ సృష్టిలో గాలి కంటే కూడా శక్తివంతమైనది ఇంకేమైనా ఉందా?’ ఆఁ... ఉంది. నా దాసుడు తన కుడిచేత్తో చేసిన దానాన్ని ఎడమ చేతిక్కూడా తెలియనంత రహస్యంగా దానం చేస్తాడు. అది వీటన్నిటి కంటే గొప్పది, శక్తిమంతమైనది.

తిర్మిజీ గ్రంథంలోనిదీ సంఘటన. ముహమ్మద్ ప్రవక్త ప్రవచనాల గ్రంథాల్లో తిర్మిజీ అత్యంత ప్రామాణిక గ్రంథంగా భావిస్తారు.



# అక్కడ అబ్బాయి పుడితే 'ముహమ్మద్' పేరు పెట్టాల్సిందే!

**2023లో ఇంగ్లాండ్, వేల్స్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన పేరుగా ముహమ్మద్ నిలిచింది.** ప్రపంచ ప్రజలకు ఇది ఆశ్చర్యం అనిపించినా...ఇది నిజమని ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్ (ONS) గణాంకాలు తెలియజేస్తున్నాయి. సాధారణంగా ఇంగ్లాండ్, వేల్స్‌లో అబ్బాయిలకు "నోవా" అనే పేరును ఎక్కువగా పెడతారు. 2016 నుంచి 2022 వరకు ఈ ధోరణి బాగా కొనసాగింది. 2022లో ఈ పేరు తర్వాత ముహమ్మద్ పేరు రెండో స్థానంలో ఉండేది. కానీ 2023లో పవిత్ర ప్రవక్త ముహమ్మద్ పేరు ప్రజాదరణలో నోవాను మించింది.

ONS ఏటా ఇంగ్లాండ్, వేల్స్‌లోని శిశువుల పేర్ల డేటాను విశ్లేషిస్తుంది. వాటిలో అత్యంత జనాదరణ పొందిన, ప్రజాదరణ లేని పేర్లను వెల్లడిస్తుంది. ప్రజాదరణ పొందిన పేర్ల వర్ణోచ్ఛారణ (స్పెల్లింగ్)ను కూడా ఖచ్చితంగా వెల్లడిస్తుంది. ఈ గణాంకాల ప్రకారం ముహమ్మద్ అనే పేరుకు ఉన్న మూడు రకాల స్పెల్లింగ్‌లు 2023లో టాప్-100 బాలుర పేర్ల జాబితాలో ఉన్నాయి. ONS లెక్కల ప్రకారం 2023లో ఇంగ్లండ్, వేల్స్‌లో 4,661 మంది చిన్నారి ముహమ్మద్‌లు జన్మించారు. 2022లో 4,177 మంది పుట్టారు. అయితే "ముహమ్మద్" పేరు గలవారు 1,601 మంది (28వ స్థానం),"ముహమ్మద్" పేరు గల చిన్నారులు 835 మంది (68వ స్థానం) ఉన్నారు. ఇంగ్లండ్‌లోని తొమ్మిది ప్రాంతాలలో నాలుగింటిలో "ముహమ్మద్" అత్యంత ప్రజాదరణ పొందిన అబ్బాయిల పేరు. వేల్స్‌లో 63వ అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తి పేరు ముహమ్మద్ అని డేటా చూపిస్తుంది. ఇంగ్లాండ్ రాచరికపు పేర్లకు ఉన్న జనాదరణను అధిగమించి ముహమ్మద్ పేరు ప్రజాదరణ పొందడం విశేషం.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలలో ఎక్కువ మంది తమ మగ పిల్లలకు ప్రవక్త ముహమ్మద్ పేరును పెట్టి దాన్ని ఐకానిక్ (విలువైన) స్థితికి తీసుకువచ్చారు. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన పేర్లలో ఒకటిగా ముహమ్మద్‌ను నిలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల మంది ప్రజలు ముహమ్మద్ అనే పేరును కలిగి ఉన్నారని అంచనా. ముహమ్మద్ పేరు స్పెల్లింగ్ దేశాన్ని, ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ముహమ్మద్ అంటే "ప్రశంసనీయుడు" అని అర్థం. ఇస్లాం చివరి ప్రవక్తగా ప్రవక్త ముహమ్మద్ ప్రఖ్యాతి గాంచారు. ఈ పేరు ముస్లింలలో గౌరవాన్ని కలిగి ఉంది. మతం పట్ల తమ నిబద్ధతను గుర్తు చేసుకునే మార్గంగా ప్రవక్త పేరును ముస్లింలు తమ పిల్లలకు పెడుతున్నారు. ముహమ్మద్ పేరుకు మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆధునికత ఉండటం విశేషం. ఈ పేరు ఒక క్లాసిక్ (శ్రేష్ఠమైన) పేరుగా యుగయుగాల సవాళ్లను తట్టుకొనే శక్తిని కలిగి ఉంది.

ముహమ్మద్ అనే పేరు గల వ్యక్తులలో దాదాపు 60% మంది మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా, పాకిస్థాన్‌లో నివసిస్తున్నారు. ముహమ్మద్, అహ్మద్ అనే పేర్లు "హమ్ద్" అనే మూల పదం నుండి వచ్చాయి. ఈ రెండు పదాలకు ప్రశంసలు అని అర్థం ఉంది. ఉనికిలో ఉన్న ప్రతిదానికి ప్రభువు అయిన అల్లాహ్‌ను స్తుతిస్తూ పవిత్ర ఖురాన్‌లోని మొదటి వాక్యం ప్రారంభమవుతుంది. అహ్మద్ అంటే అత్యంత ప్రశంసలు పొందినవాడు, చాలా ప్రశంసలకు అర్హుడు అని అర్థం. మరో మాటలో చెప్పాలంటే, అతనికి ప్రశంసనీయమైన లక్షణాలు ఉన్నాయని అర్థం.

ముహమ్మద్, అహ్మద్ అనే రెండు పేర్లు నిజంగా ప్రవక్త వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ఆయన దయ, ఔదార్యం, న్యాయం, విశ్వసనీయత వంటి ప్రశంసనీయమైన లక్షణాలను ఆయన జీవితాంతం కలిగి ఉన్నారు.

ఈ వార్త ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యింది. నిజానికి ఈ వార్త వెనుక కూడా ఇస్లామోఫోబియా ఉంది. వలస వచ్చిన ప్రవాసుల జనాభా పెరిగిపోతుందన్న భయాందోళనలు ప్రజల్లో సృష్టించే కుట్ర కూడా దీని వెనుక ఉంది. ఈ వార్త వచ్చిన తర్వాత ఇక్కడ ముస్లిం జనాభాపై కూడా కొందరు వ్యాఖ్యానించడం మొదలైంది. గమనించవలసిన విషయమేమిటంటే, ఇంగ్లీషువారు సాధారణంగా పిలిచే Fist name వేరు, ముస్లిం పిల్లలకు పెట్టే పేర్లు వేరు. ముస్లిములు చాలా పేర్లకు ముందు 'ముహమ్మద్' ఉంటుంది. Fist name విషయంలో ఉన్న తేడా వల్ల కూడా 'ముహమ్మద్' Fist name గా చాలామంది పెడుతున్నట్లు కనిపిస్తుంది. అంతే తప్ప ఇంగ్లాండులో ముస్లిం జనాభా పెరిగిపోతుంది అనడానికి ఇది నిదర్శనం కాదు.

❖

# 'చరితార్థులు'-2



# మౌలానా అలీ హుస్సేన్

## (1890 -1953)

69







**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త**

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

**రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

మాతృభూమికి స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు సాధించడంతోపాటుగా భయానక దారిద్ర్యంలో బ్రతుకులీడుస్తున్న చేనేత కష్టజీవుల కుటుంబాలలో వెలుగులు తీసుకు రావడం కూడా లక్ష్యంగా అహర్నిశలు శ్రమించిన మౌలానా అలీ హుస్సేన్ బీహార్ రాష్ట్రం నలందా జిల్లా మొహల్లా ఖాస్‌గంజ్‌లో 1890 అగస్టు 15న చేనేత కుటుంబాన జన్మించారు. చిన్నతనం నుండి నాయకత్వ లక్షణాలను పుణికి పుచ్చుకున్న ఆయన బ్రతుకుదెరువు కోసం 1906లో కలకత్తా వెళ్ళారు. అక్కడ వివిధ సంస్థలలో పనిచేస్తూ సహచరుల కష్టనష్టాల పరిష్కారానికి దారులు వెతుకుతూ ఐక్యపోరాటాలకు వ్యవస్థల ఏర్పాటు ఆరంభించారు. చిన్నతనంలో చదువు పట్ల ఆసక్తి చూపకపోయినా ఆ తరువాత విద్యా విషయాలకు ఆయన అత్యంత ప్రాధాన్యత నిస్తూ 22 ఏండ్ల వయస్సులో వయోజనవిద్య విభాగాన్ని ఏర్పాటు చేసి నిర్వహించారు. సభలు, సమావేశాలు, చర్చలు జరుపుతూ వివిధ అంశాలను తాను ఆకళింపుచేసుకోవడం మాత్రమే కాకుండా సహచరులలో చైతన్యానికి కారణమయ్యారు. ఆ క్రమంలో ప్రధానంగా చేనేత, బలహీన వర్గాల అభ్యున్నతికి నిజాయితి, నిబద్ధత, నిర్విరామ కృషికి అంకితమయ్యారు. 1919లో జరిగిన జలియన్‌వాలాబాగ్ దుస్సంఘటన తరువాత మౌలానా అలీ హుస్సేన్ జాతీయోద్యమంలో ప్రవేశించారు. మహాత్మాగాంధీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, మౌలానా మొహమ్మద్ అలీ జౌహర్‌ల విడుదల కోరుతూ వైశ్రాయి, క్వీన్ ఎలిజబెత్‌కు ప్రజల చేత ఉత్తరాలు రాయిస్తూ 'ఉత్తరాల ఉద్యమం' చేపట్టి లక్షా 50వేల ఉత్తరాలు రాయించారు. 1920లో 'జమీయతుల్ మోమిన్' ను స్థాపించి నిర్వహించిన సభలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో ఆయన కృషిని గమనించిన మహాత్ముడు ఆ సంస్థకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించపూనుకోగా సున్నితంగా తిరస్కరించారు. ఈ సంస్థ నిర్వహించిన గోడ పత్రిక 1923లో 'దివారి మోమిన్' వారపత్రికగా రూపుదిద్దుకుంది. జాతీయోద్యమంలో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమం, భారత విభజన వ్యతిరేక ఉద్యమాలలో ఆయన క్రియాశీలక పాత్ర నిర్వహించారు. మంచి వక్తగా ఖ్యాతిగాంచిన ఆయన భారీ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి విభజన ప్రతిపాదనలను వ్యతిరేకించాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు. 1946 నాటి ఎన్నికలలో చేనేత, బలహీన వర్గాల ప్రజానీకాన్ని చైతన్యపర్చి, ఏకం చేసి తమ 'జమీయతుల్ మోమిన్' సంస్థ అభ్యర్థుల గెలుపుకు, ముస్లింలీగ్ అభ్యర్థుల ఓటమికి ఆయన కారకులయ్యారు. మాతృభూమి స్వేచ్ఛా- స్వాతంత్ర్యాల సాధన, అభివృద్ధి, చేనేత, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ 'ఆసిం బీహారి' (బీహార్ దృష్టి) అని ప్రేమతో పిలిపించుకున్న మౌలానా అలీ హుస్సేన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అటాలాలో 1953 డిసెంబర్ ఆరున కన్నుమూశారు. ✤




**జీసస్ క్రైస్ట్.. ఏసు క్రీస్తు.. ఈసా(అలై) మాతృమూర్తి మర్యమ్ జీవిత గాథ ఖుర్‌ఆన్ గ్రంథం చర్చించింది.** మర్యమ్ పవిత్రతను కీర్తించింది. ఆయన కుమారుడు ఈసా (ఏసు క్రీస్తు) పుట్టుక ఎలా జరిగింది. క్రీస్తు నిజంగా సిలువ వేయబడ్డారా? ఈసా తనను తాను దేవుడిగా ప్రకటించుకున్నారా? ఇలా ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు మనకు ఖుర్‌ఆన్‌లో దొరుకుతాయి.

ఈ ప్రపంచం ఉనికిలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి దాకా మానవాళి మార్గదర్శకత్వం కోసం లక్షా ఇరవై నాలుగు వేల దైవ ప్రవక్తలు వచ్చారు. ప్రవక్తల జాబితాలో మర్యమ్ కుమారుడు ఈసా పేరు కూడా ఒకటిగా ఖుర్‌ఆన్ పేర్కొంటోంది. 'మర్యమ్' పేరుతో ఉన్న ప్రత్యేక అధ్యాయంలో మర్యమ్ పడ్డ ప్రసవ వేదన, ఆమె గర్భిణీగా ఉన్నప్పుడు ఆమె ఎదుర్కొన్న పరిస్థితులు, తమ జాతివారినుంచి ఎలాంటి ప్రతిఘటనను ఎదుర్కొన్నారు? ఇలాంటి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను ఖుర్‌ఆన్ వాక్యాల ద్వారానే తెలుసుకుందాం.

## ఈసా అల్లాహ్ ప్రవక్త

మర్యమ్ పుత్రుడైన మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాడు. ఆయనకు పూర్వం కూడా ఎంతోమంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి సద్గుణ సంపన్నురాలు. (దివ్యఖుర్‌ఆన్ 5:75)

(ఈసా) పిల్లవాడు ఇలా పలికాడు, "నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన నాకు గ్రంథాన్ని ఇచ్చాడు, నన్ను ప్రవక్తగా నియమించాడు. నేను ఎక్కడున్నా సరే, ఆయన నన్ను శుభవంతునిగా చేశాడు. నేను జీవించి ఉన్నంత కాలం నమాజును, జకాతును పాటించు అని ఆజ్ఞాపించాడు. నా తల్లి హక్కును నెరవేర్చేవానిగా నన్ను చేశాడు. నన్ను దౌర్జన్యపరునిగాను, పాషాణ హృదయునిగాను చేయలేదు. నేను పుట్టిన రోజునా, నేను మరణించేరోజునా, బ్రతికింపబడి లేపబడే రోజునా నాకు శాంతి కలుగుతుంది." (దివ్య ఖుర్‌ఆన్ 19:35)

## ప్రజల్ని ప్రభువు వైపునకు పిలిచిన క్రీస్తు

స్పష్టమైన సూచనలను తీసుకువచ్చిన ఈసా ఇలా అన్నాడు, "నేను మీవద్దకు వివేకం తీసుకుని వచ్చాను, మీరు విభేదాలకు లోనైన కొన్ని విషయాల వాస్తవాన్ని మీకు స్పష్టంగా వివరించటానికి వచ్చాను. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి, నన్ను అనుసరించండి. యదార్థం ఏమిటంటే, అల్లాహ్‌యే మీ ప్రభువూ, నా ప్రభువూనూ, ఆయననే మీరు ఆరాధించండి. ఇదే సరియైన మార్గం. (43:63)

## ఈసాపై దైవవాణి అవతరణ

ప్రవక్తా! మేము నీ వైపునకు వహీ (దైవవాణి)ని పంపాము, నూహ్

వైపునకు ఆయన తరువాతి ప్రవక్తల వైపునకు పంపినట్లు. మేము ఇబ్రాహీము, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతతి, ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్, సులైమాన్‌ల వైపునకు వహీని పంపాము. మేము దావూద్‌కు 'జబూర్'ను ప్రసాదించాము. మేము ఇంతకుముందు నీతో ప్రస్తావించిన ప్రవక్తల వైపునకు కూడ వహీని పంపాము. (4:163)

## క్రీస్తు సిలువ వేయబడ్డాడా?

"మేము మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా అనే దైవప్రవక్తను చంపాము" అని అన్నారు- వాస్తవానికి వారు ఆయనను చంపనూ లేదు, శిలువపైకి ఎక్కించనూ లేదు. కాని ఆ విషయంలో వారు భ్రమకు గురిచెయ్యబడ్డారు. ఈ విషయం గురించి అభిప్రాయ భేదం వ్యక్తం చేసిన వారు కూడా సందేహానికి లోనయ్యారు. దీనిని గురించి వారికి అసలు ఏమీ తెలియదు. వారు కేవలం ఊహనే అనుసరిస్తున్నారు. వారు అతనిని నిశ్చయంగా చంపలేదు. కాని అల్లాహ్ ఆయనను తన వైపునకు లేపుకున్నాడు. అల్లాహ్ అద్భుత శక్తి సంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. (దివ్యఖుర్‌ఆన్ 4:176)

## షిర్క్ (బహు దైవారాధన) పాపమని చెప్పిన క్రీస్తు

మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్ అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. వాస్తవానికి మసీహ్ ఇలా అన్నాడు: ఇస్రాయీలు వంశీయులారా! అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఆయన నాకూ ప్రభువే మీకూ ప్రభువే. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు. (దివ్యఖుర్‌ఆన్ 5:72)

## ఆయన దేవుని కుమారుడా?

"మసీహ్ అల్లాహ్ కుమారుడు" అని క్రైస్తవులు అంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడివున్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి. (5:33)

## ఏసు పరిశుద్ధాత్మ

గ్రంథ ప్రజలారా! మీ ధర్మ విషయాలలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్‌కు సత్యం తప్ప వేరే విషయాన్ని ఆపాదించకండి. మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా, అల్లాహ్ పంపిన ఒక ప్రవక్త, అల్లాహ్ మర్యమ్ వైపునకు పంపిన ఒక ఆజ్ఞ, అల్లాహ్ తరపు నుండి వచ్చిన (మర్యమ్ గర్భంలో బిడ్డ రూపం దాల్చిన) ఒక ఆత్మ తప్ప మరేమీ కాదు. కనుక అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను విశ్వసించండి. 'ముగ్గురు' అని అనకండి. ఇలా అనటం మాని వెయ్యండి. ఇది మీకే శ్రేయస్కరం. అల్లాహ్ ఒక్కడే దేవుడు. ఆయన పరిశుద్ధుడు. ఆయనకు ఒక కొడుకు ఉన్నాడనే విషయానికి ఆయన అతీతుడు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన ఆస్తియే. దాని పోషణకు, దాని రక్షణకు ఆయనే చాలు. (4:171)

## ముహమ్మద్ రాక గురించి ముందే చెప్పిన జీసస్ క్రీస్తు..

మర్యమ్ కుమారుడు ఈసా అనిన మాటలను జ్ఞాపకం తెచ్చుకో, "ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా! నేను మీ వద్దకు అల్లాహ్‌చే పంపబడిన సందేశహరుణ్ణి నాకు పూర్వం వచ్చిన తౌరాత్ గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను నా తరువాత అహ్మద్ అనే ప్రవక్త రాబోతున్నాడు అనే శుభవార్తను అందజేస్తున్నాను. (61:6)

## ఈసా తల్లి మర్యమ్ అల్లాహ్ విధేయురాలు..

తరువాత ఒకప్పుడు దైవదూతలు వచ్చి మర్యమ్‌తో ఇలా అన్నారు: "మర్యమ్! అల్లాహ్ నిన్ను ఎన్నుకున్నాడు. నీకు పరిశుద్ధతను ప్రసాదించాడు. ప్రపంచ మహిళలందరిపై నీకు ప్రాధాన్యమునిచ్చి నిన్ను తన సేవకొరకు ఎన్నుకున్నాడు. మర్యమ్! నీవు నీ ప్రభువునకు విధేయురాలవుగా ఉండు. ఆయన సాన్నిధ్యంలో సజ్‌దా చెయ్యి (సాష్టాంగపడు). రుకూచేసే దాసులతో నీవూ రుకూ చెయ్యి (నమ్రతతో వంగు)." (3:42-43)

## మృతులను బ్రతికించిన ఈసా (ఏసు)

ఇంకా అతనిని ఇస్రాయీలు సంతతి వద్దకు తన ప్రవక్తగా పంపుతాడు." (ప్రవక్తగా ఇస్రాయీలు సంతతి వద్దకు వచ్చినప్పుడు అతను ఇలా అన్నాడు) : "నేను మీ ప్రభువు నుండి మీ వద్దకు సూచనను తీసుకువచ్చాను. మీముందే నేను మట్టితో పక్షి ఆకారం గల ఒక బొమ్మను తయారుచేసి దానిలోకి శ్వాస ఊదుతాను. అది అల్లాహ్ ఆజ్ఞతో పక్షి అవుతుంది. నేను అల్లాహ్ ఆజ్ఞతో పుట్టు గ్రుడ్డిని, కుష్ఠరోగిని బాగుచేస్తాను. ఆయన అనుజ్ఞతో మృతులను బ్రతికిస్తాను. ఇంకా మీరు ఏమేమి తింటారో, మీ గృహాలలో ఏమేమి నిలువ చేసి ఉంచుతారో కూడా మీకు తెలుపుతాను. మీరు విశ్వసించే వారే అయితే, వాస్తవంగా ఇందులో మీకు గొప్ప సూచన ఉంది. (3:49)

"మర్యమ్ కుమారుడవైన ఈసా! నీవు మనుజ జాతితో, అల్లాహ్‌ను కాదని నన్నూ, నా తల్లిని దేవుళ్ళుగా భావించండి అని బోధించావా?" అని అడిగినపుడు అతను ఇలా మనవి చేసుకుంటాడు: "నీవు అత్యంత పవిత్రుడవు! ఏ మాటను అనే హక్కు నాకు లేదో ఆ మాటను అనటం నాకు యుక్తమైన పనికాదు. ఒకవేళ నేను ఆవిధంగా అని ఉంటే, అది నీకు తప్పకుండా తెలిసి వుండేది. నా మనస్సులో ఏముందో నీకు తెలుసు. నీ మనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవు గుప్తంగా ఉన్న యథార్థాలన్నీ

తెలిసిన మహాజ్ఞానివి. నీవు ఆదేశించిన దానిని తప్ప దేనినీ నేను వారికి చెప్పలేదు. అది ఏమిటంటే అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. నేను వారిమధ్య ఉన్నంత కాలంవరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండేవాడవు. (5:116-117)

## మర్యమ్ పుట్టుక

“ప్రభూ! నా గర్భంలో ఉన్న శిశువును నేను నీకు సమర్పించు కుంటున్నాను. అది నీ సేవకు అంకితం. నా ఈ కానుకను స్వీకరించు. నీవు అన్నీ వినేవాడవు, అన్నీ తెలిసిన వాడవు.” తరువాత ఆమెకు ఆడు శిశువు జన్మించినపుడు, ఆమె ఇలా విన్నవించుకుంది: “ప్రభూ! నాకు ఆడు శిశువు కలిగింది - ఆమెకు ఏ శిశువు పుట్టిందో అల్లాహ్‌కు బాగా తెలుసు - బాలుడు బాలిక వంటివాడు కాడు. సరే, నేను దానికి మర్యమ్ అని పేరు పెట్టాను. శాపగ్రస్తుడైన షైతాను బారినుండి రక్షణ కొరకు నేను దానినీ, దాని సంతానాన్నీ నీకు అప్పగిస్తున్నాను.” చివరకు ఆమె ప్రభువు ఆ బాలికను సంతోషంతో స్వీకరించి ఆమెను ఒక మంచి బాలికగా తీర్చిదిద్దాడు. ఇంకా, జకరియ్యాను ఆమెకు సంరక్షకుడుగా నియమించాడు. (3:35-36)

## మర్యమ్ కోసం ఆకాశం నుంచి ఆహారం

జకరియ్య ఆమె గదికి పోయినప్పుడల్లా, ఆమె వద్ద ఆయన ఏవో కొన్ని భోజన పదార్థములను చూసేవాడు. ఆమెను ఇలా అడిగేవాడు : “మర్యమ్! ఇవి నీ వద్దకు ఎక్కడ నుండి వచ్చాయి?” ఆమె ఇలా జవాబు చెప్పేది : “అల్లాహ్ నుండి వచ్చాయి. అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తాడు. (3:37)

## మర్యమ్‌కు సంతాన శుభవార్త

దైవదూతలు ఇలా అన్నారు: “మర్యమ్! అల్లాహ్ తన ఒక ‘ఆజ్ఞ’కు సంబంధించిన శుభవార్తను నీకు పంపుతున్నాడు. అతని పేరు ఈసా మసీహ్. అతను మర్యమ్ కుమారుడు. అతడు ఇహపర లోకాలలో గౌరవనీయుడౌతాడు. అల్లాహ్ సామీప్యం పొందిన దాసులలోని వాడుగా పరిగణింపబడతాడు. ఉయ్యాలలో ఉన్నప్పుడూ, పెరిగి పెద్దవాడైనప్పుడూ ప్రజలతో సంభాషిస్తాడు. ఇంకా అతను ఒక సత్పురుషుడౌతాడు.” ఇది విన్న మర్యమ్ ఇలా అన్నారు: “ప్రభూ! నాకు శిశువు ఎలా జన్మిస్తుంది? నన్ను ఏ పురుషుడూ చేతితోనైనా తాకలేదే!” సమధానం లభించింది: “అలానే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరినదాన్ని సృష్టిస్తాడు. ఆయన ఒక పనిని చెయ్యాలని నిర్ణయించినప్పుడు, కేవలం దానిని “అయిపో” అంటాడు. అంతే, అది అయిపోతుంది.” (3: 45-47)

## ఉయ్యాలలోనే మాట్లాడిన ఈసా (ఏసు)..

ప్రవక్తా! ఈ గ్రంథంలో, మర్యమ్ తన వారినుండి వేరైపోయి, తూర్పు దిక్కున ఏకాంతంగా కూర్చుండి, వారికి చాటుగా తెర కట్టుకుని ఉండిపోయినప్పటి వృత్తాంతాన్ని ప్రస్తావించు. ఈ స్థితిలో మేము ఆమె వద్దకు మా ‘ఆత్మ’ను (అంటే దూతను) పంపాము. అప్పుడు అతడు ఆమె ముందు పరిపూర్ణమైన మానవాకారంలో ప్రత్యక్షమయ్యాడు. వెంటనే మర్యమ్ ఇలా పలికింది, “నీవు దైవభీతి కల మనిషివే అయితే, నేను నీ బారినుండి రక్షించ వలసినదిగా దయామయుడైన దేవుని శరణు కోరుకుంటున్నాను.” అతను “నేను నీ ప్రభువు దూతను మాత్రమే. నీకు ఒక పరిశుద్ధ పుత్రుణ్ణి ఇచ్చేందుకు పంపబడ్డాను” అని చెప్పాడు. మర్యమ్ “నాకు పుత్రుడు ఎలా పుడతాడు, నన్ను పురుషుడు ఎవడూ తాకనైనా లేదు, నేను చెడు నడత గల దానినీ కాను” అని అన్నది. దైవదూత ఇలా అన్నాడు, “అలాగే జరుగుతుంది.” నీ ప్రభువు, “అలా చేయటం నాకు చాల సులభం. ఆ బాలుణ్ణి ప్రజల కొరకు ఒక సూచనగా, మా తరపు నుండి ఒక కారుణ్యంగా చేయాలని మేము ఈ పని చేస్తున్నాము. ఇది జరిగి తీరవలసిన విషయమే” అని సెలవిస్తున్నాడు.

మర్యమ్ ఆ మగ శిశువును గర్భంలో దాల్చింది. గర్భవతి అయిన ఆమె ఒక దూర ప్రదేశానికి వెళ్ళిపోయింది. తరువాత ప్రసవ వేదన పడుతూ ఆమె ఒక ఖర్జూరపు చెట్టు క్రిందకు చేరింది. ఆమె ఇలా వాపోయింది, “అయ్యో! నేను ఇంతకు ముందే మరణించి ఉంటే, నామరూపాలు లేకుండా నశించి ఉంటే ఎంత బాగుండేది!” అపుడు దైవదూత కాళ్లవైపు నుండి ఆమెను పిలిచి ఇలా అన్నాడు, “బాధపడకు. నీ ప్రభువు నీకు దిగువ భాగంలో ఒక సెలయేరును సృజించాడు. నీవు ఈ చెట్టు మొదలు కొంచెం ఊపు. నీపై స్వచ్ఛమైన తాజా ఖర్జూరపు పండ్లు రాల్తాయి. నీవు తిను, త్రాగు, నీ కళ్లను చల్లబరచుకో. తరువాత ఎవరైనా మనిషి నీకు కనిపిస్తే, అతనికి, నేను కరుణా మయుని కోసం ఉపవాస ముంటానని మొక్కుకున్నాను. కనుక ఈ రోజు నేను ఎవరితోనూ మాట్లాడను” అని చెప్పు.

తరువాత ఆమె ఆ బాలుణ్ణి తీసుకొని తన జాతి వారి వద్దకు వచ్చింది. ప్రజలు ఇలా అన్నారు, “మర్యమ్! నీవు పెద్ద పాపమే చేశావు. ఓ హారున్ సోదరీ! నీ తండ్రి కూడ చెడ్డ మనిషికాడే నీ తల్లి కూడ నీతిబాహ్యమైన నడత గల స్త్రీకాదే!” మర్యమ్ బాలునివైపు సైగజేసి చూపింది. దానికి ప్రజలు, “ఉయ్యాలలోని ఈ పసిపిల్లవానితో మేము ఏం మాట్లాడము?” అని అన్నారు. పిల్లవాడు ఇలా పలికాడు, “నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన నాకు గ్రంథాన్ని ఇచ్చాడు, నన్ను ప్రవక్తగా నియమించాడు. నేను ఎక్కడున్నా సరే, ఆయన నన్ను శుభవంతునిగా చేశాడు. నేను జీవించి ఉన్నంత కాలం నమాజును, జకాతును పాటించు అని ఆజ్ఞాపించాడు. (19:17-31) ❖



# పక్షులు, కీటకాల పోషణా అల్లాహ్‌దే!

- వసీమ్ సుల్తాన

**తమ ఆహారాన్ని మోసుకుంటూ తిరగని జంతువులు ఎన్నో ఉన్నాయి. అల్లాహ్ వాటికి ఉపాధిని సమకూరుస్తాడు, మీ ఉపాధి ప్రదాత కూడా ఆయనే. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను. (ఖుర్‌ఆన్ 29:60)**

వారిని అడుగు : ఆకాశం నుండీ భూమి నుండీ మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు? (10:31)

భూమ్యాకాశాలలోని నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. తాను కోరిన వారికి ఆయన పుష్కలంగా ఉపాధిని ఇస్తాడు తాను కోరినవారికి ఆయన ఆచితూచి ఉపాధిని ఇస్తాడు. (42:12)

ధరణిపై సంచరించే ఏ ప్రాణి ఉపాధి అయినా అల్లాహ్ బాధ్యతలో లేకుండా లేదు. ఆ ప్రాణి ఎక్కడ నివసిస్తుందో అది ఎక్కడకు చేర్చబడనున్నదో ఆయనకు తెలియకుండా లేవు. సమస్తమూ ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడి ఉన్నది. (11:6)

“పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. ఆయన మీకూ ఉపాధినిస్తాడు. మీ సంతానానికీ ఉపాధిని ఇస్తాడు.” (దివ్యఖుర్‌ఆన్ 17)

“పక్షులు ఉషోదయాన ఆకలితో తమ గూళ్ళను వదిలి సంధ్యా సమయ మయ్యేసరికి కడుపు నింపుకుని తిరిగి వస్తాయి. వాటన్నింటికీ ఆహారాన్ని అందించేది అల్లాహ్‌యే”

ఈ సృష్టిలో జీవరాశుల పోషణ బాధ్యత అల్లాహ్‌దే అన్నది పై ఖుర్‌ఆన్ వాక్యాల సారాంశం.

‘భూమిపై లెక్కలేనన్ని జంతువులు ఉన్నాయి, అవి తమ జీవనోపాధిని నిల్వ చేయవు, వాటి సేకరణ గురించి చింతించవు” భూమిలోపల తలదాచుకుంటున్న కీటకాలు, చీమలు మొదలుకుని, ఆకాశంలో ఎగిరే పక్షులు, నీటిలో నివసించే చేపలు, ఇతరత్రా జీవరాశులన్నింటికీ అల్లాహ్‌యే ఆహారాన్ని సమకూరుస్తున్నాడు.

ఇంతకూ ఈ అసంఖ్యాకమయిన పక్షులు, పశువులు, ప్రాణులు మీ కళ్లెదుట గాలిలో, నీటిలో, నేలపైన సంచరిస్తున్నాయి. వీటిలో ఏదీ తన ఉపాధిని తానే మోసుకుంటూ తిరుగదు; వీటినన్నింటినీ పోషిస్తున్నవాడు అల్లాహ్ మాత్రమేగా. అవి ఎక్కడికి వెళ్లినా దైవానుగ్రహం వల్ల వాటికి ఏదో ఒక విధంగా ఉపాధి లభిస్తూనే ఉంటుంది. ఒక్కొక్క పిట్ట గూడును, ఒక్కొక్క పురుగు బిలాన్నీ అల్లాహ్ ఎరుగును. ఏ ప్రాణి ఎక్కడ ఉందో అల్లాహ్‌కు బాగా తెలుసును. అందువల్ల మీరు ఉపాధి గురించి యోచించి ధైర్యం సడలి కూర్చోకండని మానవజాతికి సూచిస్తున్నాడు అల్లాహ్. మనిషి పుట్టిన తరువాత తల్లి పాలద్వారా ఆహార ఏర్పాటు చేస్తాడు. పెరిగి పెద్దయ్యాక ఆయన తన దయతో పరిశుద్ధమయిన విశాల శుభవరాల విస్తరి పరచి ఉండగా చూస్తాము. నీరు, ధాన్యాలు, కూరగాయలు. ఫలాలు. మాంసం, ఉప్పు, కారం, సుగంధద్రవ్యాలు, ఇవన్నీ ఆహార అవసరాలకు ఎంతో అనుకూలమయినవిగా చేసిన వాడెవడని ఖుర్‌ఆన్ ప్రశ్నిస్తుంది. ఇవన్నీ ఇంత విరివిగా ఈ ధరణిలో సంప్రాప్తమయ్యే ఏర్పాటు చేసిది అల్లాహ్‌యే. ఆహారపు ఈ అపరిమితమయిన నిధులు భువి నుండి వెంట వెంటనే పైకి వచ్చి, వాటి అందుబాటులో అంతరాయమూ రాకుండా ఈ ఏర్పాటు చేస్తున్నాడు. ఒకవేళ ఈ ఆహార వనరుల ఏర్పాటు జరగకపోయి ఉన్నట్లయితే సమస్త జీవరాశుల పరిస్థితి ఎలా ఉండేదో! అల్లాహ్ సృష్టికర్త మాత్రమే కాదు, ప్రాణుల పోషణ బాధ్యతా ఆయనదే. అయితే కొందరికి ఎక్కువ, మరికొందరికి తక్కువ లభిస్తుంది.

## ఉపాధి కోసం అన్వేషించాలి!

నమాజు ముగిసిన తరువాత భూమిపై వ్యాపించండి, అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి (62:10)

పక్షుల మాదిరిగానే మానవులు కూడా ఉపాధి కోసం అన్వేషిస్తే తప్పకుండా అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది. చీమలు, కీటకాల ఆహారాన్ని అందించడానికి ఇంత శ్రద్ధ వహించి నప్పుడు సృష్టిరాశుల్లో ఉత్తమ జీవి అయిన మనిషి పై ఇంకెంత శ్రద్ధవహిస్తాడో కదా! అల్లాహ్ అనుగ్రహాన్ని, దయ స్వరూపాన్ని, కారుణ్యాన్ని మనిషి అర్థం చేసుకోలేక పోతున్నాడు. ఉపాధికోసం అడ్డదారులు తొక్కి ద్రోహానికి పాల్పడుతున్నాడు. ❖




## జమిలీ బిల్లుపై 31 మందితో జేపీసీ

'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును పరిశీలించడానికి 31 మంది సభ్యులతో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది ఎంపీలున్నారు. అలాగే, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులున్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి రాజ్యాంగం, సంబంధిత చట్టాలను సవరిస్తూ తీసుకొచ్చారు. లోక్‌సభకు చెందిన 21 మంది ఎంపీల జాబితాలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులున్నారు. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వంటి నాయకులున్నారు. టీడీపీ నుంచి గంటి హరీష్ బాలయోగి, జనసేన నుంచి వల్లభనేని బాలశౌరి కూడా కమిటీలో భాగస్వామ్యమయ్యారు. లోక్‌సభలో 21 మంది సభ్యులలో 10 మంది బీజేపీకి చెందిన వారు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన, శివసేన (శిండే), ఆర్ఎల్‌డీలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు, ఎన్సీపీ, టీఎంసీ, డీఎంకేకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు.

## ఆడబిడ్డలకు దేశంలో రక్షణ లేదు

దేశాన్ని కుదిపేసిన భయంకరమైన నిర్భయ సామూహిక హత్యాచార ఘటన జరిగి 12 ఏండ్లు దాటుతున్నా, దేశంలో ఇప్పటికి పరిస్థితులు మారలేదని, ఈ దేశంలో ఆడబిడ్డలకు రక్షణ లేదని నిర్భయ తల్లి ఆశా దేవి ఆందోళన వ్యక్తం చేశారు. 16 డిసెంబర్ 2012న చోటుచేసుకున్న ఈ ఘటన దేశ ప్రజల్ని కలిచివేసింది. ఓ కార్యక్రమంలో నిర్భయ తల్లి ఆశాదేవి ప్రసంగించారు. నిర్భయకు ముందునాటి పరిస్థితులే ఇప్పుడూ కొనసాగుతున్నాయని, కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హత్యాచార ఘటనే ఇందుకు ఉదాహరణగా ఆమె పేర్కొన్నారు. ఈ కేసులో వాస్తవం ఏమిటన్నదీ ఇప్పటికీ బయటకు రాలేదని అన్నారు. 'నా కూతురు ఇప్పుడు లేదు. కానీ ఆమె చెప్పిన మాటలు నాకు ఇంకా గుర్తు ఉన్నాయి. మళ్లీ ఇలాంటి ఘటన జరగకుండా దోషులకు శిక్ష పడాలని నా కూతురు కోరుకుంది. అయితే నిర్భయ ఘటన జరిగి 12 ఏండ్లు అవుతున్నా.. ఈ దేశపు ఆడబిడ్డలకు రక్షణ లేదు' అని అన్నారు.

## యాచకులకు డబ్బులిస్తే జైలుకే

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరాన్ని యాచకులు లేని నగరంగా మార్చాలని సంకల్పించిన జిల్లా యంత్రాంగం ఈ దిశలో మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే ఇక్కడ భిక్షాటనపై నిషేధం ఉండగా, తాజాగా యాచకులకు డబ్బులు ఇచ్చేవారిపైనా కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. అలాంటి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. కొత్త ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఈ కొత్త చట్టం అమలులోకి రానున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సింగ్ తెలిపారు. పుణ్యం కోసం దానం చేసి కష్టాలు పాలు కావద్దని కలెక్టర్ ప్రజలను హెచ్చరించారు. అయితే కలెక్టర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంపై విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. పేదవాడికి కప్పు చాయ్ కొనివ్వడం కూడా నేరమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా 10 నగరాలను యాచకులు లేని నగరాలుగా మార్చాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం. ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని ఇండోర్‌లో అమలు చేయాలని నిర్ణయించారు.

## ప్రార్థనా స్థలాల సర్వేలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టంపై ఇవాళ సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ప్రార్థనా స్థలాల వద్ద సర్వేలు నిలిపి వేయాలని, ఆ స్థలాలపై కొత్త కేసులను స్వీకరించరాదు అని దేశంలోని ట్రయల్ కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రార్థనా స్థలాల చట్టానికి లింకున్న కేసులపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం వాదనలు జరిపింది. మతపరమైన ప్రదేశాలకు చెందిన అంశాల్లో ఆదేశాలు ఇవ్వడం ఆపివేయాలని సుప్రీంకోర్టు తన తీర్పులో తెలిపింది. ప్రార్థనా స్థలాలపై ఉన్న పెండింగ్ కేసుల విషయంలో కూడా సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. కోర్టులు ఆ కేసుల్లో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దు అని చెప్పింది. సుప్రీం ఇచ్చిన తాజా ఆదేశాలను హిందువుల తరపున వాదిస్తున్న అనేక మంది లాయర్లు వ్యతిరేకించారు. తమ వాదనలు వినకుండా ఆదేశాలు ఇవ్వొద్దు అని కోరారు. ప్రార్థనా స్థలాల అంశంపై రిప్లై ఇవ్వాలని కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది కోర్టు. ఇక ఇలాంటి కేసుల్లో పార్టీలుగా ఉన్నవారికి అదనంగా మరో నాలుగు వారాల సమయాన్ని కేటాయించింది. ప్రార్థనా స్థలాల చట్టంలోని 2,3, 4 సెక్షన్లను తొలగించాలని అశ్విని ఉపాధ్యాయ కోరారు. మధుర శ్రీకృష్ణ జన్మభూమి కేసు తమ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.




## ప్రతి గంటకు నీట మునిగి 30 మంది మృతి

2021 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా మూడు లక్షలమంది నీటిలో మునిగి చనిపోయినట్లు తాజాగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) నివేదిక తెలిపింది. ఈ లెక్కల్నిబట్టి చూస్తే.. బహుశా ప్రతి గంటకు 30 మంది నీటి ప్రమాదాల వల్ల చని పోయారని డబ్ల్యూహెచ్ఓ అంచనా వేసింది. ఈ మేరకు డిసెంబర్ 13న డబ్ల్యూహెచ్ఓ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి తక్కువ ఆదాయం, మధ్యస్థ ఆదాయం గల దేశాల్లో ఈ ప్రమాదాలు 92 శాతం సంభవించాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇక 2021లో ఆగ్నేయాసియా దేశాల్లో (భారత్‌తో సహా) 83 వేల మరణాలు సంభవించాయి. ఇవి మొత్తం మరణాలలో 28 శాతంగా ఉందని ఈ నివేదిక పేర్కొంది.

## గాజాలో కాల్పులు విరమించాలి

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ఐరాస జనరల్ అసెంబ్లీ డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా మొత్తం 193 సభ్యులకు గాను 158 మంది దీనికి మద్దతు తెలిపారు. తొమ్మిది మంది వ్యతిరేకించగా, 13 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా 54 మంది జర్నలిస్టులు మృతి

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదిలో 54 మంది జర్నలిస్టులు తమ విధులను నిర్వహిస్తున్నప్పుడు లేదా వారి వృత్తి కారణంగా మృతి చెందారు. వారిలో మూడో వంతు ఇజ్రాయిల్ సైన్యం చేత చంపబడ్డారని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఆరెస్ఎఎఫ్) ప్రచురించిన వార్షిక నివేదికలో పేర్కొంది. పత్రికా స్వేచ్ఛ, ఎన్జీఓల సమాచారం ప్రకారం ఈ సంవత్సరంలో 18 మంది జర్నలిస్టుల మరణాలకు ఇజ్రాయిల్ సాయుధ దళాలు కారణమయ్యాయని తెలిపింది. గాజాలో 16 మంది, లెబనాన్‌లో ఇద్దరు మృతి చెందినట్టు పేర్కొంది. పాలస్తీనా జర్నలిస్టులకు అత్యంత ప్రమాదకరమైన దేశంగా, గత ఐదేండ్లలో (డిసెంబర్ 1 వరకు) ఇతర దేశాల కంటే ఎక్కువ మరణాల సంఖ్య నమోదైందని ఆర్ఎస్ఎఫ్ తన వార్షిక నివేదికలో పేర్కొంది. "జర్నలిస్టులపై ఇజ్రాయిల్ సైన్యం చేసిన యుద్ధ నేరాల"పై ఆ సంస్థ అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసీసీ)లో నాలుగు ఫిర్యాదులను దాఖలు చేసింది. అక్టోబరు 2023లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి గాజాలో మొత్తం 145 మందికిపైగా జర్నలిస్టులు మరణించారని, వారిలో 35 మంది విధుల నిర్వహణలో మరణించారని ఆర్ఎస్ఎఫ్ తెలిపింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 104 మంది జర్నలిస్టులు మరణించారని, వారిలో సగానికిపైగా గాజాలో ఉన్నారని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐ.ఎఫ్.జె) ప్రచురించిన ప్రత్యేక నివేదికలో పేర్కొంది. మృతులను లెక్కించడంలో ఉపయోగించే రెండు వేర్వేరు పద్ధతుల కారణంగా ఐ.ఎఫ్.జె, ఆర్ఎస్ఎఫ్ మధ్య గణాంకాలు విభిన్నంగా ఉంటాయి. ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగా జర్నలిస్టులకు హాని చేస్తుందనే నివేదికను ఖండించింది. అయితే సైనిక వైమానిక దాడుల్లో కొందరు మరణించారని అంగీకరించింది. ఆర్ఎస్ఎఫ్ గణాంకాల ప్రకారం, డిసెంబర్ 1 నాటికి ప్రపంచవ్యాప్తంగా 550 మంది జర్నలిస్టులు అరెస్టు అయ్యారు. గత ఏడాది 513 మందిని అరెస్టు చేశారు.

## వచ్చే ఏడాది చివరిలో బంగ్లాదేశ్ ఎన్నికలు

బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది చివరలో గాని, 2026 ప్రారంభంలో గాని సార్వత్రిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని చెప్పారు. జాతినుద్దేశించి ఆయన టెలివిజన్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 చివరినాటికి లేదా 2026 ప్రథమార్ధంలో ఎన్నికల తేదీలను నిర్ణయించవచ్చన్నారు. అయితే ఈ ఎన్నికల్లోగా పలు ఎన్నికల సంస్కరణలు చేపట్టాల్సి వుందని అన్నారు. ఎటువంటి లోపాలు, లొసుగులు లేని ఓటరు జాబితాలను రూపొందించడంతో సహా పలు సంస్కరణలతో ఈ ఎన్నికలను నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు అంగీకరిస్తే 2025 నవంబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించవచ్చని అన్నారు. ఎన్నికల సంస్కరణల కమిషన్ సిఫార్సు అదనపు సంస్కరణలు చేపట్టాలంటే మరో ఆరు మాసాలు సమయం కావాల్సి వుంటుందన్నారు. కాబట్టి 2026 మొదటి ఆరు మాసాల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు వుంటాయని స్పష్టం చేశారు.

# అతిథి సత్కారం స్వర్గానికి మార్గం!!

ముహమ్మద్ వహీదుద్దీన్


**ఒకసారి** ఓ గృహిణి అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) దగ్గరకు వచ్చి 'నా భర్త రోజూ ఎవరో ఒక అతిథిని ఇంటికి తీసుకొస్తారు. రోజూ వారికి రొట్టెలు చేసి, వంటలు వండి, అతిథి మర్యాదలు చేసి చాలా అలసిపోతున్నాను' అని తన గోడును వెళ్లబోసుకుంది. ఈ మాటలకు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోవడంతో ఆమె అక్కడ నుండి వెళ్లిపోయింది. తరువాత అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆ గృహిణి భర్తను పిలిచి 'నేను ఈ రోజు మీ ఇంటికి అతిథిగా వస్తున్నాను' అని చెప్పడంతో అతను సంతోషంతో, ఆనందంతో పొంగిపోయాడు. ఇంటికి వెళ్లి భార్యతో 'ఈరోజు అంతిమ దైవప్రవక్త (స)మన ఇంటికి అతిథిగా వస్తున్నారు' అని సంతోషంగా, ఆనందంగా చెప్పాడు. ఆ మాట విని ఆమె ఎంతో సంతోషంగా, ఆనందించింది. భక్తిశ్రద్ధలతో రకరకాల వంటకాలు సర్వం సిద్ధం చేసింది. ఇంతలో దైవప్రవక్త ముహమ్మద్(స) ఇంటికి వచ్చారు. ఆయనకు సకల మర్యాదలు చేసారు. భోజనం ముగించుకుని తిరిగి వెళ్తున్న దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆ ఇంటి యజమానితో 'నేను వెళ్లే ద్వారం వైపు చూడమని నీ భార్యతో చెప్పు' అన్నారు. ఆ మేరకు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వెళ్తున్న వైపే కనురెప్పలు కొట్టకుండా ఆమె చూసింది. దైవప్రవక్త ముహమ్మద్ (స) వెనకాలే పాములు, తేళ్లు, వంటి హానికర జీవాలు ఇంటి నుండి బయటకు వెళ్లడం కనిపించింది. ఆమెకు స్పృహ తప్పినంత పనయ్యింది. ఎందుకు ఇలా జరిగిందో తెలుసుకోవడానికి దైవ ప్రవక్త ముహమ్మద్(స) దగ్గరికి వచ్చిందామె. అదే విషయం అడిగింది. 'ఇంటికి వచ్చిన అతిథి వెళ్తూ వెళ్తూ ఆ ఇంట్లోవారి విపత్తులు, ఆపదలు, కష్టాలు తీసుకుని వెళ్తాడు.

మంచి భోజనం వండటానికి చేసిన కష్టానికి ప్రతిఫలం అది' అని దైవప్రవక్త ముహమ్మద్ (స) చెప్పారు. 'అల్లాహ్‌ను, పరలోక జీవితాన్ని నమ్మేవారు అతిథి మర్యాదలు చేయాలి. ఇంటికి వచ్చిన అతిథిని ఆపద అనుకోవద్దు. అతిథిని ఇంటికి శుభంగా భావించాలి. అతిథి సత్కార్యంలో మన మేలు దాగి ఉన్నది. ఏ ఇంటి ద్వారాలైతే అతిథుల కోసం తెరిచి ఉంటాయో, ఆ ఇంటి వారికోసం స్వర్గద్వారాలు తెరిచి ఉంటాయి. అతిథి సత్కారం స్వర్గానికి మార్గం' అనేవారు దైవప్రవక్త ముహమ్మద్ (స).

హ|జత్ అలీ (రజి)రోజూ ఎవరో ఒకరిని భోజనానికి ఇంటికి పిలిచేవారు. అతిథి దొరకని నాడు ఆ రోజు పస్తులుండేవారు.

ఇలా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు విన్న సహచరులు అతిథుల రాకకోసం నిరీక్షించేవారు. అంతేకాదు తమ ఇంట్లో అతిథుల కోసం ప్రత్యేక గదిని నిర్మించేవారు దాన్ని 'మెహమాన్ ఖానా' అని పిలుచుకునేవారు. ఇంటికి వచ్చిన అతిథిని నవ్వుతూ స్వాగతించడం, వెళ్లేటప్పుడు గడప దాకా వెళ్లి సాగనం పడం అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) సంప్రదాయం.

మనకందరికీ అతిథులను సత్కరించే, గౌరవించే సౌభాగ్యం కలిగించుగాక! ఆమీన్!! యా రబ్బులాలమీన్!!!




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**